RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | బుధవారం | పేజీలు : 6
సంపుటి : 4, సంచిక : 21 | డిసెంబర్ 24, 2025 | వెల : రూ.3-00



4లో.. 12 మంది

## పిల్లలు.. 5 పందులు!



# ఎండ్ గేమ్?!

## కీలక దశలో మావోయిస్టు పార్టీ ఉద్యమం

3లో..

- అగ్రనేతల వరుస ఎన్ కౌంటర్లతో ఉక్కిరిబిక్కిరి
- లొంగుబాట్లతో ఖాళీ అవుతున్న దండకారణ్యం
- అత్యాధునిక టెక్నాలజీతో మావోయిస్టుల కదలికలపై నిఘా
- బలగాల కూంబింగ్ తో నైరాశ్యంలో లీడర్స్, క్యాడర్
- పార్టీని వెంటాడుతున్న అనారోగ్య సమస్యలు
- పాతకాలపు ఆయుధాలతోనే పోరాటం..
- అభద్రతా భావంలోనే పోలీసుల సమక్షంలో జనజీవన స్రవంతిలోకి..
- ఇరువర్గాల మధ్య నలిగిపోతున్న ఆదివాసీ పల్లెలు

**వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి:**

దేశంలోనే దశాబ్దాల పాటు భద్రతా బలగాలకు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పెద్ద సవాలుగా నిలిచిన మావోయిస్టు ఉద్యమం ఇప్పుడు కీలక దశలో ఉందన్న వాదన బలపడుతోంది. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన '2026 మార్చ్' డెడ్‌లైన్ గడవు ముగియకముందే, మావోయిస్టుల ప్రధాన కంచుకోటగా పేరున్న దండకారణ్యం శరవేగంగా ఖాళీ అవుతోందన్న సంకేతాలు వరుస ఘటనల రూపంలో బయటపడుతున్నాయి. భారీ ఎన్‌కౌంటర్లు, అగ్రనేతల మృత్యువాత, వందల సంఖ్యలో లొంగుబాట్లు, మరోవైపు బలగాల కఠిన కూంబింగ్ ఆపరేషన్లు.. ఇవన్నీ కలిసి మావోయిస్టు పార్టీని తీవ్ర అంతర్మథనంలోకి నెట్టేశాయి. ఈ మార్పులకు కేంద్ర బిందువుగా నిలుస్తున్నది ఆపరేషన్ కగార్.



ఇది కేంద్ర ప్రభుత్వం ఆషామాషీగా చేపట్టిన ఆపరేషన్ కాదు.. బస్తర్–అబూజ్మాడ్ అడవుల్లో కొత్త సెక్యూరిటీ క్యాంపులు, సీఆర్పీఎఫ్–కోబ్రా–రాష్ట్ర పోలీసుల సమిష్టి కూంబింగ్, డ్రోన్లు, ఇంటెలిజెన్స్ టెక్నాలజీ ఆధారిత నిఘా, రహదారులు, టెలికాం వంటి మౌలిక వసతుల విస్తరణ.. ఈ అన్ని చర్యలు కలిసి మావోయిస్టులు సంవత్సరాలుగా ఆధారపడిన సేఫ్ జోన్స్ భావననే కూల్చేశాయి. ఒకప్పుడు అడవి మావోయిస్టులకు రక్షణ కవచంలా ఉండేది. ఇప్పుడు అదే అడవి ప్రతి అడుగులో ప్రమాదంగా మారి మావోయిస్టులకు అంతానికి కారణమవుతోంది. ఇదిలా ఉంటే ఓ వైపు మావోయిస్టులు, మరో వైపు పోలీసు బలగాల మొహరింపుతో అడవి పల్లెలు, ఆమాయక ఆదివాసీ గిరిజనులు భయంతో వణికిపోతున్నారు.

## ఇక అంతా డిజిటల్ చెల్లింపులే!

- గ్రామ పంచాయతీ నిధుల నిర్వహణకు కొత్త నిబంధనలు
- చెల్లింపుల ఆమోదానికి రెండంచెల వ్యవస్థ
- ఏక పక్ష నిర్ణయాలకు తావులేకుండా ఉమ్మడి బాధ్యత
- పారదర్శకతకు ప్రభుత్వం కీలక నిర్ణయం




**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

గ్రామ పంచాయతీల నిధుల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచే లక్ష్యంతో ప్రభుత్వం కొత్త డిజిటల్ నిబంధనలను అమల్లోకి తీసుకొచ్చింది. 15వ ఆర్థిక సంఘం నిధులు, రాష్ట్ర ఆర్థిక సంఘం గ్రాంట్ల వినియోగంలో ఇకపై మాన్యువల్ చెల్లింపులకు అవకాశం ఉండదని స్పష్టం చేసింది. అన్ని లావాదేవీలు తప్పనిసరిగా పీఎఫ్ఎంఎస్, ఈ–గ్రామ్ స్వరాజ్ పోర్టల్ ద్వారానే జరగాలని ఆదేశాలు జారీ అయ్యాయి. కొత్త మిగతా 3వ పేజీలో..

## ఆర్థిక సంస్కరణలకు పునాది వేసిన దార్శనికుడు

- దేశాన్ని క్లిష్ట పరిస్థితుల్లో ముందుకు నడిపించిన మహనీయుడు
- తెలంగాణ గడ్డ నుంచి జాతీయస్థాయికి ఎదిగిన గొప్ప వ్యక్తి
- పీవీ నర్సింహారావు వర్ధంతి సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**



భారత ఆర్థిక సంస్కరణలకు పునాది వేసిన దార్శనిక నాయకుడు పీవీ నర్సింహారావు అని, క్లిష్ట పరిస్థితుల్లో దేశాన్ని ముందుకు నడిపించిన ఆయన ధైర్యమైన నిర్ణయాలు నేటికీ మార్గదర్శకంగా నిలుస్తున్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ ముద్దు బిడ్డ, స్వర్గీయ పీవీ నర్సింహారావు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఆధునిక ఆర్థిక శక్తిగా భారతదేశాన్ని నిల బెట్టడంలో కీలక పాత్ర పోషించి, పాలన పై తనదైన ముద్ర వేశారన్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత్‌కు గౌరవప్రదమైన స్థానం తీసుకురావడంలో ఆయన పాత్ర చిరస్మరణీయమని తెలిపారు. తెలంగాణ గడ్డ నుంచి జాతీయ స్థాయికి ఎదిగి దేశానికి సేవలందించిన మహానేతగా పీవీ నర్సింహారావు చరిత్రలో నిలిచిపోయారని అన్నారు. రాజకీయాలకు అతీతంగా ఆలోచించి, దేశ హితాన్ని ప్రథమంగా పెట్టుకున్న నాయకత్వానికి ఆయన ప్రతిరూపమని ప్రశంసించారు. తెలంగాణ ప్రజలకు ఆయన ఎప్పటికీ గర్వకారణమని పేర్కొన్నారు. పీవీ నర్సింహారావు ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలు దేశ అభివృద్ధి దిశను పూర్తిగా మార్చాయని, వాటి ఫలితాలను భారత్ నేటికీ అనుభవిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. పాలనలో సంయమనం, నిర్ణయాలలో స్పష్టత, దూరదృష్టి కలిగిన నాయకత్వమే ఆయన అసలైన వారసత్వమని వ్యాఖ్యానించారు. మొత్తానికి, పీవీ నర్సింహారావు వర్ధంతి సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి అర్పించిన ఈ నివాళులు, ఆ మహనీయుడి సేవలను మరోసారి స్మరించుకునే సందర్భంగా నిలిచాయి. దేశం, రాష్ట్రం అభివృద్ధికి ఆయన చూపిన మార్గం తరతరాలకు ప్రేరణగా నిలుస్తుందని సీఎం పేర్కొన్నారు.

## ట్రిపుల్ ఆర్ పేరుతో భూములు లాక్కుంటున్నారు



- రాయగిరి రైతులకు తీరని అన్యాయం
- అలైన్‌మెంట్ మార్పుల వెనుక అవినీతి
- ప్రభుత్వం హామీలపై స్పష్టత ఇవ్వాలి
- ఇష్టం లేకుండా భూములు లాక్కుంటే ప్రతిఘటనే
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

**వేద న్యూస్, రాయగిరి:**

రాయగిరి ప్రజల పరిస్థితి అన్యాయంగా మారిందని, భువనగిరి నియోజకవర్గంలోని రాయగిరి ప్రజలు ఇప్పటికే ఆరేడు ప్రాజెక్టుల కోసం తమ భూములు ఇచ్చి ఎన్నో త్యాగాలు చేశారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత వ్యాఖ్యానించారు. రాయగిరిలో ట్రిపుల్‌ఆర్ ప్రాజెక్టు కారణంగా నిర్వాసితులుగా మారుతున్న ప్రజలతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతులు, స్థానికులు ఎదుర్కొంటున్న బాధలను ప్రత్యక్షంగా విన్న ఆమె.. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. ఎలాగూ భూములు ఇచ్చారనే భావనతో ట్రిపుల్‌ఆర్ పేరుతో మళ్లీ అదే రైతుల భూములు తీసుకునే ప్రయత్నం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది రైతుల జీవితాలపై నేరుగా దాడి చేసినట్లేనని మిగతా 4వ పేజీలో..

## 200 ఏళ్లు చెక్కు చెదరకుండా పనులు

- మేడారం జాతరకు శాశ్వత అభివృద్ధి పనులు చేపడుతున్నాం
- ఆదివాసీ గిరిజనుల మనోభావాలకు భంగం కలగనివ్వం
- అనుకున్న గడువులోనే మేడారం పనులు పూర్తి
- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి


4లో..



## నదీ జలాలపై సీఎంకు అవగాహన లేదు

- సాగునీటిపై మంత్రులది అంతులేని అజ్ఞానం
- ఇచ్చిన 420 హామీలు అమలు చేయకనే ప్రభుత్వానికి భయం
- కేసులు, బెదిరింపులకు బీఆర్ఎస్ లొంగదు
- తెలంగాణ రైతాంగం కోసం పోరాటం ఆగదు – కేటీఆర్

3లో..



# పీఆర్సీని వెంటనే ప్రకటించాలి..

- ఐదు డీఏలను కూడా చెల్లించాలి
- పీఎస్హెచ్ఎంఏ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ నూతి మల్లన్న



**వేద న్యూస్, ఇబ్రహీంపట్నం:**

ఉద్యోగులకు పీఆర్సీని వెంటనే ప్రకటించి పెండింగ్లో ఉన్న ఐదు డీఏలను విడుదల చేయాలని ప్రైమరి స్కూల్ హెడ్ మాస్టర్స్ అసోషియేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ నూతి మల్లన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని దేవిశ్రీ గార్డెన్లో సోమవారం రాత్రి నిర్వహించిన సంఘం యొక్క సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై ఉపాధ్యాయ సమస్యల గురించి విపులంగా చర్చించారు. ఈ సర్వసభ్య సమావేశంలో నూతన జిల్లా కమిటీ కోసం ఎన్నికలు నిర్వహించటం జరిగింది. ఈ ఎన్నికలో జిల్లా కమిటీ అధ్యక్షుడిగా వర్షకొండ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు అచ్చ విజయభాస్కర్, ప్రధాన కార్యదర్శిగా చల్లా లక్ష్మారెడ్డి, గౌరవ అధ్యక్షులుగా జంగా గంగాధర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అసోసియేట్ ప్రెసిడెంట్గా జరుపుల సుధాకర్, కె.లక్ష్మి, ఉపాధ్యక్షులుగా ఎం. గంగాధర్, ఆర్. శ్రీనివాస్, జి. రవీందర్, మహిళా ఉపాధ్యక్షురాలిగా ఆర్ కనకతార, సీహెచ్ వాణి, ఏ. సుజాత, ఆర్థిక కార్యదర్శిగా ఇ. రవీందర్, మీడియా సెక్రెటరీగా డి భీమయ్య, ఆర్గనైజింగ్ సెక్రెటరీ కె.లక్ష్మీనారాయణ, సెక్రెటరీలుగా ఎల్ రాజు, టి వేణుగోపాల్, కె తిరుపతి, కె. నాగరాజ్, బి. రెడ్డి, ఎల్. కిష్టయ్య, వి.రవీందర్, మహిళా కార్యదర్శులుగా పి.స్వరూప, ఎం. హేమలత, ఎల్ ధర్మవ్వ, స్టేట్ కౌన్సిలర్లుగా ఎస్. నరసయ్య, జె. సుదర్శన్, పి రమేష్, డి.వెంకటరమణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన నూతన కార్యవర్గం చేత ప్రమాణ స్వీకారం చేయించుట జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర సంఘటన కార్యదర్శి నూతి మల్లన్న మాట్లాడుతూ.. పీఆర్సిని ప్రకటించకుండా బకాయిలు చెల్లించకుండా ఉద్యోగ, ఉపాధ్యాయులను ఆర్థికంగా ఇబ్బంది కలిగించటం ప్రభుత్వానికి సరికాదన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం ప్రభుత్వం తక్షణం స్పందించి పీఆర్సీ, ఐదు డీఏలు, పెండింగ్ బిల్లులు క్లియర్ చేయాలని కోరారు. అలాగే మహిళలకు చైల్డ్ కేర్ సెలవులు మొత్తం సర్వీస్ కాలంలో వాడుకునే విధంగా వెసులుబాటు ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బాధ్యులు సాతల నరసయ్య,డి శంకర్,నూతన కార్యవర్గ సభ్యులు,జిల్లా వ్యాప్తంగా వచ్చిన ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

# మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించండి

- సీనియర్ అడ్వకేట్ గుండ్రాతి శారద గౌడ్

**వేద న్యూస్, మహబూబాబాద్:**




తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ గా మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని, ఇప్పటి వరకూ లాయర్ల సమస్యలపై ఎవరూ చేయని పనులు చేసి చూపిస్తానని, బార్ కౌన్సిల్ సభ్యుల అభ్యున్నతికి పాటుపడుతా అని మహబూబాబాద్ బార్ కౌన్సిల్ సభ్యుల సమావేశంలో హై కోర్ట్ సీనియర్ అడ్వకేట్ గుండ్రాతి శారద గౌడ్ లాయర్లను ఓటు అభ్యర్థించారు. తెలంగాణ బార్ కౌన్సిల్లో సమూల మార్పులు తేవాలని, అడ్వకేట్లకు ప్రభుత్వం ద్వారా అన్ని సంక్షేమ పథకాలు అందేలా చేయాలని, కనీసం ఒక న్యాయవాదికి బ్యాంకు రుణం కూడా ఇచ్చే పరిస్థితి లేదని అన్నారు. మహిళా న్యాయవాధుల భద్రత కోసం ప్రత్యేక చట్టాల రూప కల్పన చేయాలని డిమాండ్లతో వాటి సాధన కోసమే ప్రత్యేక మానిఫెస్టో తో తాను ముందుకు వచ్చినట్లు తెలిపారు. ఇప్పటివరకూ తెలంగాణ బార్ కౌన్సిల్లో మహిళా న్యాయవాదులకు రిజర్వేషన్ లేదని, ఇప్పుడు అది సాధించి మొదటిసారి తెలంగాణా బార్ కౌన్సిల్ లో మహిళా న్యాయవాదిగా పోటీ చేస్తున్నట్లు, తనకు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని ఆమె కోరారు.

# బాధితులకు అండగా నిలవాలి

- ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలి
- అనుమానితులపై నిరంతరం నిఘా ఉంచాలి
- మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాస రావు
- పోలీస్ అధికారులతో నెలవారీ నేర సమీక్ష




**వేద న్యూస్ మెదక్:**

దర్యాప్తులో వేగం పెంచి, ప్రతి కేసును నాణ్యంగా, త్వరితగతిన పూర్తిచేసి బాధితులకు న్యాయం చేయాలని మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాస రావు అన్నారు. జిల్లా పోలీస్ అధికారులతో మంగళవారం నెలవారీ నేర సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. అధికారులకు సూచించారు. లాంగ్ పెండింగ్ కేసుల ఛేదనకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని, అవసరమైతే ఇన్వెస్టిగేషన్ సపోర్ట్ సెంటర్ సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. ఎస్హెచ్ఓలు తమ పరిధిలోని ప్రతి గ్రామాన్ని తప్పనిసరిగా సందర్శించి స్థానిక సమస్యలను తెలుసుకోవాలని, విలేజ్ పోలీస్ అధికారులు తమకు కేటాయించిన గ్రామాలపై పూర్తి అవగాహన కలిగి ముందస్తు సమాచారాన్ని సేకరించాలని ఆదేశించారు. రౌడీషీటర్లు, అనుమానితుల కదలికలపై నిరంతర నిఘా ఉంచి తరచూ తనిఖీలు నిర్వహించాలని సూచించారు. బ్లూకోల్ట్స్, నైట్ పెట్రోలింగ్ సిబ్బంది పాపిలోన్ డివైస్లను సమర్థవంతంగా వినియోగిస్తూ అనుమానాస్పద వ్యక్తుల వేలిముద్రలను సేకరించాలని తెలిపారు. మహిళా భద్రత, రోడ్డు ప్రమాదాలు, ఆర్థిక నేరాలు, ఆన్లైన్ మోసాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించే కార్యక్రమాలు నిర్వహిస్తూ చైతన్యపరచాలని సూచించారు. నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల ప్రాధాన్యతను ప్రజలకు వివరించాలని, వివిధ కుల, మతాలకు చెందిన పవిత్ర స్థలాలు, పరిశ్రమలు, ధాబాలు, పెట్రోల్ పంపులు తదితర ముఖ్యమైన ప్రాంతాల్లో కమ్యూనిటీ సీసీ కెమెరాల ఏర్పాటు కోసం అవగాహన కల్పించాలని ఎస్హెచ్ఓలకు సూచించారు. ఈ సమావేశంలో హత్య కేసులో శిక్ష పడేందుకు కృషి చేసిన సీఐ వెంకట రాజా గౌడ్, ఎస్సై నారాయణ, కోర్ట్ లైసోనింగ్ ఆఫీసర్ విఠల్, కానిస్టేబుల్ రవీందర్ గౌడ్, అశోక్, కోర్ట్ సిబ్బంది మహిపాల్ రెడ్డి, ఆనంద్, వెంకట్, విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్లూస్ టీం, షీ టీం సిబ్బందికి జిల్లా ఎస్పీ అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా అదనపు ఎస్పీ మహేందర్, డీఎస్పీలు ప్రసన్న కుమార్, నరేందర్ గౌడ్, సుభాష్ చంద్ర బోస్, సీఐ లు వెంకట రాజా గౌడ్, మహేష్, రేణుక రెడ్డి, సందీప్ రెడ్డి, జాన్ రెడ్డి, రంగా కృష్ణ, జర్జ్, ఎస్సై లు, సిబ్బంది పాల్గొన్నారు.

## హనుమాన్ టెంపుల్ అభివృద్ధి పనులు మొదలు

**వేద న్యూస్, సుల్తానాబాద్:**



కాట్నపల్లి గ్రామ సర్పంచ్ ఓగుల పూజ రాజేందర్ సర్పంచ్ గా బాధ్యతలు స్వీకరించిన మరునాటి నుంచే పనులు మొదలుపెట్టారు. మంగళవారం గ్రామంలోని హనుమాన్ టెంపు ల్ అభివృద్ధి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు దాసరి శారద అనిల్, శ్రీనివాస్ గ్రామ పెద్దలు భాస్కర్ రెడ్డి , రామారావు మేఘనాథ్ చారి తదితరులు పాల్గొన్నారు.

# శ్రామికుల స్థితిగతులపై స్టడీ

- కాటన్ పరిశ్రమలలో పనిచేస్తున్నవారి..

**వేద న్యూస్, జమ్మికుంట:**



జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాల అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మంగళవారం జమ్మికుంట పట్టణంలోని కాటన్ పరిశ్రమలలో పనిచేస్తున్న శ్రామికుల సాంఘిక ఆర్థిక స్థితిగతులపై స్టడీ ప్రాజెక్టు చేశారు. ఈ స్టడీ ప్రాజెక్టులో భాగంగా విద్యార్థులు శ్రామికుల.. విద్యస్థాయి, నివాస వసతి, ఆరోగ్య స్థితిగతులు, వృత్తిపరమైన అనారోగ్య సమస్యలు, ఆరోగ్య బీమా, నెలవారి ఆదాయం, వినియోగ వ్యయం, పొదుపు, కాటన్ పరిశ్రమలలో కల్పిస్తున్న వసతుల గురించి ఈ ప్రాజెక్టులో అధ్యయనం చేశారు. ఈ ప్రాజెక్టులో విద్యార్థులు కావేరి, రాహుల్, శశాంక్, స్ఫూర్తి, వైష్ణవి, ఆఫ్రిద్ మరియు ప్రాజెక్టు సూపర్వైజర్ డాక్టర్ రాజేంద్రం పాల్గొన్నారు.

# జెడ్పీహెచ్ఎస్ పాఠశాల సందర్శన

**వేద న్యూస్, బోయినిపల్లి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం కోదురుపాక గ్రామ సర్పంచ్గా ప్రమాణ స్వీకారం చేసిన తరువాత, కత్తెరపాక మంజుల సుధాకర్ మంగళవారం జిల్లా పరిషత్ హై స్కూల్ సందర్శించారు. మధ్యాహ్న భోజనంపై విద్యార్థులను అరా తీశారు. అనంతరం అధ్యాపకులతో సమావేశం నిర్వహించారు. పదవ తరగతి విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. చదవు పట్ల మెళకువలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కత్తెరపాక సుధాకర్, వార్డ్ సభ్యులు అన్నాళదాసు భాస్కర్, బలాగోని శ్రీనివాస్, సమత, నాగుల రవి వర్మ, యూత్ సభ్యులు కత్తెరపాక పర్శరాములు, విక్కీ, కొండల్ రావు, బి.అనిల్, పి. రాజు, అభిలాష్ పాల్గొన్నారు.

# 'తల్లి పేరు మీద ఒక మొక్క'

- ప్రధాని మోడీ పిలుపు మేరకు మొక్కలు నాటిన విద్యార్థులు

**వేద న్యూస్, వేములవాడ:**





రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలో మై భారత్ ఆధ్వర్యంలో వేములవాడ వివేకానంద జూనియర్ కళాశాలలో, భారత ప్రధాని నరేంద్ర మోడీ పిలుపు మేరకు(ఏక్ పేడ్ మా కే నామ్) తల్లి పేరు మీద ఒక మొక్క నాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు ఎస్సె రైటింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మై భారత్ వలంటరీ గంగిపెల్లి స్వామి కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులందరూ పర్యావరణాన్ని, కాపాడుతూ.. మన రోజు వారి దినచర్యలో పర్యావరణ రహిత, వాడకాలను ప్రోత్సహించాలని కుటుంబ సభ్యులకు, అలాగే గ్రామస్తులకు, అవగాహన కల్పించే విధంగా విద్యార్థులందరూ ముందుకు రావాలన్నారు. అలాగే తమ తల్లి పేరు మీద ఒక మొక్కను నాటాలని, అంతే బాధ్యతగా మొక్కను రక్షించాలన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులను అందజేసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు నరేష్, వికాస్, రాజశేఖర్, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## గ్రామ అభివృద్ధి కోసం పాటుపడాలి

- బీఆర్ఎస్ నాయకుడు దుంపల రత్నాకర్ రెడ్డి

**వేద న్యూస్, శాయంపేట:**



ఎన్నికల్లో ఎవరు గెలిచినా, ఎవరు ఓడినా అందరూ గ్రామ అభివృద్ధి కోసమే కలిసి కట్టుగా పనిచేయాలని బీఆర్ఎస్ నాయకుడు దుంపల రత్నాకర్ రెడ్డి అన్నారు. తరువాత రత్నాకర్ రెడ్డి మాట్లాడుతూ.. గెలిచిన వాళ్ళు చేస్తారని, ఓడిన వాళ్ళు ఊరికే ఉండకూడదన్నారు. గ్రామం కోసం బాధపడే కొన్ని కుటుంబాల కోసం అయి నా అందరిని కలుపుకొని ప్రభుత్వంతో పోరాడాలని సూచించారు. ప్రజలం దరూ కలిసి గెలిపించుకున్నటువంటి సర్పంచ్ ను ముందుండి నడిపించాలని, అప్పుడే గ్రామం అభివృద్ధి చెందుతుందన్నారు. ఏ పార్టీ అయినా సహాయం కోసం వస్తే చేయాలన్నారు.

## బ్రిడ్జి పనులను వెంటనే పునరుద్ధరించాలి


- బోయినిపల్లి సీపీఎం డిమాండ్

**వేద న్యూస్, బోయినిపల్లి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం స్తంభంపల్లి గంజి వాగు మధ్యలో ఆగిపోయిన బ్రిడ్జి పనులను వెంటనే చేపట్టాలని, కాంట్రాక్టర్ చేసిన తప్పిదానికి సామాన్య ప్రజానీకాన్ని, ప్రయాణికులను ఇబ్బంది పెట్టడం సరికాదని బోయినిపల్లి మండల సీపీఎం శాఖ డిమాండ్ చేస్తుంది. ఏ మాత్రం కూడా ఈ ప్రభుత్వానికి, ఈ రెండు నియోజకవర్గాల ఎమ్మెల్యేలకు మానవత్వం ఉంటే యుద్ధ ప్రాతిపదికన బ్రిడ్జి పనులు చేపట్టాలని కోరింది. పనులు చేపట్టకపోతే పెద్ద ఎత్తున ప్రజలను కూడగట్టుకుని ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరించింది. ఈ కార్యక్రమంలో బోయినిపల్లి మండల సీపీఎం మండల కన్వీనర్ గురిజాల శ్రీధర్, జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు రామంచ అశోక్, మండల నాయకులు కుడుకల గిరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

## తహసీల్దార్, ఎస్సైకు సన్మానం




**వేద న్యూస్, రుద్రూర్:**

రుద్రూర్ మండలంలోని రాయకుర్ గ్రామంలో నిర్వహించిన సందల్ కార్యక్రమాలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్సై సాయన్న బందోబస్తు నిర్వహించారు. ఈ సందర్భంగా మాలిక్ లతీఫ్ షా దర్గా కమిటీ ఆధ్వర్యంలో రుద్రూర్ తహసీల్దార్ తారాబాయి, ఎస్సై సాయన్నకు శాలువా పూలమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాలిక్ లతీఫ్ షా దర్గా కమిటీ అధ్యక్షుడు సయ్యద్ ముస్తఫా, మంజు, ఇంచార్జ్ సయ్యద్ బషీర్, సయ్యద్ అహ్మద్, సయ్యద్ లతీఫ్ తదితరులు పాల్గొన్నారు.



# ఎండ్ గేమ్?!

## కీలక దశలో మావోయిస్టు పార్టీ ఉద్యమం

- అగ్రనేతల వరుస ఎన్ కౌంటర్లతో ఉక్కిరిబిక్కిరి
- లొంగుబాట్లతో ఖాళీ అవుతున్న దండకారణ్యం
- అత్యాధునిక టెక్నాలజీతో మావోయిస్టుల కదలికలపై నిఘా
- బలగాల కూంబింగ్ తో నైరాశ్యంలో లీడర్స్, క్యాడర్
- పార్టీని వెంటాడుతున్న అనారోగ్య సమస్యలు
- పాతకాలపు ఆయుధాలతోనే పోరాటం..
- అభద్రతా భావంలోనే పోలీసుల సమక్షంలో జనజీవన స్రవంతిలోకి..
- ఇరువర్గాల మధ్య నలిగిపోతున్న ఆదివాసీ పల్లెలు

**వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి:**



దేశంలోనే దశాబ్దాల పాటు భద్రతా బలగాలకు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పెద్ద సవాలుగా నిలిచిన మావోయిస్టు ఉద్యమం ఇప్పుడు కీలక దశలో ఉందన్న వాదన బలపడుతోంది. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన '2026 మార్చ్' డెడ్‌లైన్ గడవు ముగియకముందే, మావోయిస్టుల ప్రధాన కంచుకోటగా పేరున్న దండకారణ్యం శరవేగంగా ఖాళీ అవుతోందన్న సంకేతాలు వరుస ఘటనల రూపంలో బయటపడుతున్నాయి. భారీ ఎన్‌కౌంటర్లు, అగ్రనేతల మృత్యువాత, వందల సంఖ్యలో లొంగుబాట్లు, మరోవైపు బలగాల కఠిన కూంబింగ్ ఆపరేషన్లు.. ఇవన్నీ కలిసి మావోయిస్టు పార్టీని తీవ్ర అంతర్మథనంలోకి నెట్టేశాయి. ఈ మార్పులకు కేంద్ర బిందువుగా నిలుస్తున్నది ఆపరేషన్ కగార్. ఇది కేంద్ర ప్రభుత్వం ఆషామాషీగా చేపట్టిన ఆపరేషన్ కాదు.. బస్తర్–అబూజ్మాడ్ అడవుల్లో కొత్త సెక్యూరిటీ క్యాంపులు, సీఆర్పీఎఫ్–కోబ్రా–రాష్ట్ర పోలీసుల సమిష్టి కూంబింగ్, డ్రోన్లు, ఇంటెలిజెన్స్ టెక్నాలజీ ఆధారిత నిఘా, రహదారులు, టెలికాం వంటి మౌలిక వసతుల విస్తరణ.. ఈ అన్ని చర్యలు కలిసి మావోయిస్టులు సంవత్సరాలుగా ఆధారపడిన సేఫ్ జోన్స్ భావననే కూల్చేశాయి. ఒకప్పుడు అడవి మావోయిస్టులకు రక్షణ కవచంలా ఉండేది. ఇప్పుడు అదే అడవి ప్రతి అడుగులో ప్రమాదంగా మారి మావోయిస్టులకు అంతానికి కారణమవుతోంది. ఇదిలా ఉంటే ఓ వైపు మావోయిస్టులు, మరో వైపు పోలీసు బలగాల మోహరింపుతో అడవి పల్లెలు, ఆమాయక ఆదివాసీ గిరిజనులు భయంతో వణికిపోతున్నారు.

**– కీలక లీడర్లే టార్గెట్!**

గత ఆరు నెలల కాలంలో వరుస భారీ ఎన్‌కౌంటర్లతో పచ్చని పల్లెల్లు రక్తమోడాయి. అయితే ఈ ఎన్‌కౌంటర్లు మావోయిస్టు నెట్‌వర్క్‌లో కీలకమైన నాయకత్వాన్ని లక్ష్యంగా చేసుకుని జరిగాయన్న విశ్లేషణ వినిపిస్తోంది. సెంట్రల్ కమిటీ నుంచి జోనల్, డివిజనల్ స్థాయి వరకు పలువురు కీలక మావోయిస్టు నేతలు మృత్యువాత పడటం పార్టీకి భారీ షాక్ తగిలినట్లయింది. అగ్రనేతలు అంటే ఒక వ్యక్తితో పోయేది కాదు.. వారి వెంట కమ్యూనికేషన్ వ్యవస్థ, ఫండింగ్ మార్గాలు, రిక్రూట్‌మెంట్ ఛానళ్లు కూడా కూలిపోతాయి. అందుకే ఈ నష్టాన్ని మావోయిస్టు పార్టీ తట్టుకోలేకపోతోందన్నది అనేది భద్రతా వర్గాల అంచనా.

**– నెక్స్ట్ తమ వంతే అనుకుని..**

ఈ క్రమంలోనే బస్తర్ ప్రాంతంలో మావోయిస్టలకు ప్రతీకగా మారిన మాడ్వి హిడ్మా మృతి, అంతేకాదు అనేక అగ్రనేతలు ఎన్ కౌంటర్లలో ప్రాణాలు కోల్పోవడం మావోయిస్టు పార్టీలో తీవ్ర మానసిక కలకలం రేపాయి. హిడ్మా వంటి శక్తివంతమైన అగ్రనేతలు కూడా మృత్యువాత పడడంతో.., ఇక ఎవరికీ సురక్షితం కాదన్న అనుమానమే కేడర్‌లో భయాన్ని నాటింది. ఇది కేంద్రానికి, బలగాలకు తెలియకుండానే దక్కిన సైకాలజికల్ అడ్వాంటేజ్ అని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఇదే సమయంలో మరో కీలక పరిణామం భారీగా జరిగిన లొంగుబాట్లు.. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో పోలీసుల సమక్షంలోనే అగ్రనేతలు, స్టేట్, డివిజనల్ కమిటీ సభ్యులు, వందలాది మంది కేడర్ లొంగిపోవడం మావోయిస్టు ఉద్యమ చరిత్రలోనే అరుదైన దృశ్యం. ఆయుధాలతో సహా లొంగిపోవడం అంటే పార్టీలో మోరల్ ఎంతగా క్షీణించిందో చెప్పకనే చెబుతోంది. దీనికి కూంబింగ్ ఒత్తిడి ఒక కారణమైతే, మరోవైపు రిహ్యాబిలిటేషన్ ప్యాకేజీలు, కుటుంబ భద్రత హామీలు కూడా లొంగుబాట్లకు దోహదపడుతున్నాయి.

**– బలగాల ఒత్తిడి.. అనారోగ్య సమస్యలు**

అయితే ఈ సంక్షోభానికి కారణాలు కేవలం బలగాల కూంబింగ్, ఎన్ కౌంటర్ల ఒత్తిడి మాత్రమే కాదు.. మావోయిస్టు పార్టీలో అంతర్గత వ్యవహారాలు, ఆధిపత్య ధోరణి కూడా కీలక పాత్ర పోషిస్తున్నాయి అనే వాదన కూడా ఉంది. స్థానిక కేడర్‌పై అగ్రనేతల పెత్తనం, అనుమానాల పేరుతో శిక్షలు, 'పార్టీ గీతా దాటారు' అంటూ జరిగే అంతర్గత హింస.. ఇవన్నీ సంవత్సరాలుగా కేడర్‌లో అసంతృప్తిని పెంచాయి. ఒకప్పుడు విప్లవమే జీవితం అన్న భావన, ఇప్పుడు జీవితం కాపాడుకోవాలంటే విప్లవం నుంచి బయట పడాలి.. అనే ఆలోచనను పుట్టించాయి.. దీనికి తోడు మావోయిస్టులను వెంటాడుతున్న మరో పెద్ద సమస్య అనారోగ్యం. దండకారణ్యంలో సరైన వైద్యం లేకపోవడం, మలేరియా వంటి దీర్ఘకాలిక వ్యాధులు, గాయాలకు చికిత్స అందకపోవడం.. ఈ పరిస్థితుల్లో అడవిలో జీవనం అసాధ్యంగా మారింది. బలగాలు సరఫరా మార్గాలపై నియంత్రణ పెంచడంతో మందులు, ఆహారం, ఆయుధాల లాజిస్టిక్స్ చైన్ కూడా కూలిపోతోంది. ఫలితంగా ఇన్నాళ్లూ తమకు సేఫ్ జోన్స్ గా భావించిన అడవిని ఖాళీ చేయాల్సిన అనివార్య పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

**– డ్రోన్ కన్ను.. డిజిటల్ నిఘా..**

మావోయిస్టుల ఏరివేతలో భద్రతా బలగాలు ఇప్పుడు సంప్రదాయ కూంబింగ్‌కే పరిమితం కావడం లేదు. అత్యాధునిక సాంకేతికత, ఆధునిక ఆయుధ వ్యవస్థలు, డ్రోన్లు, శాటిలైట్ ఆధారిత నిఘా, రియల్‌టైమ్ ఇంటెలిజెన్స్ షేరింగ్ వంటి మార్గాలను వినియోగిస్తూ మావోయిస్టుల ప్రతి కదలికను దాదాపు పూర్తి స్థాయిలో ట్రాక్ చేస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఈ ఆపరేషన్ల కోసం భారీగా నిధులు వెచ్చించడంతో, కొత్త క్యాంపులు, ఆధునిక కమ్యూనికేషన్ పరికరాలు, నైట్ విజన్ సిస్టమ్స్, ప్రత్యేక శిక్షణ పొందిన బలగాలు దండకారణ్య ప్రాంతంలో నిరంతరం మోహరించబడ్డాయి. ఈ స్థాయిలో టెక్నాలజీ ఆధారిత దాడుల ముందు మావోయిస్టు పార్టీ తట్టుకోలేకపోతోంది. మరోవైపు మావోయిస్టుల వద్ద ఇప్పటికీ పాతకాలం నాటి ఆయుధాలు, పరిమిత కమ్యూనికేషన్ వ్యవస్థలు, ఆధునిక టెక్నాలజీని వినియో గించే సామర్థ్యం లేకపోవడం స్పష్టంగా బయటపడుతోంది. ఒకప్పుడు అడవులే రక్షణగా భావించిన వ్యూహం, ఇప్పుడు డ్రోన్ కన్ను, డిజిటల్ నిఘా ముందు పనిచేయడం లేదు. ఈ టెక్నాలజీనే మావోయిస్టుల పతనానికి ప్రధాన కారణంగా మారిందన్న విశ్లేషణ భద్రతా వర్గాల్లో విస్తృతంగా వినిపిస్తోంది.

**– డెడ్ లైన్ కు ముందే ఎండ్ గేమ్ అవుతుందా?**

రెండ్రోజుల క్రితం వెలుగులోకి వచ్చిన మావోయిస్టు అగ్రనేత గాదె ఇన్నయ్య అరెస్టు కూడా ఈ పరిణామాలకు బలం చేకూర్చింది. నెట్‌వర్క్‌లో కీలక లింక్‌లుగా ఉన్న నేతలు ఒక్కొక్కరుగా బయటపడుతుండటం, మావోయిస్టు నిర్మాణం ఎంత బలహీనంగా మారిందో స్పష్టంగా చూపిస్తోంది. ఈ అన్ని పరిణామాలను కలిపి చూస్తే, మావోయిస్టు పార్టీ ప్రస్తుతం క్షీణత దశలో ఉందన్న అభిప్రాయం బలపడుతోంది. అయితే 2026 డెడ్ లైన్కు ముందే ఇది పూర్తిస్థాయి ఎండ్ గేమ్ అవుతుందా? అన్న ప్రశ్నకు సమాధానం ఇంకా భవిష్యత్తులో తేలనుంది.

**– నలిగిపోతున్న ఆదివాసీలు**

వరుస ఎన్‌కౌంటర్ల నేపథ్యంలో మావోయిస్టులు–భద్రతా బలగాల మధ్య నలిగిపోతున్నది గిరిజన గ్రామాలు, అడవి పల్లెలు, ఆదివాసీల జీవితాలే. ఒకవైపు మావోయిస్టుల ఉనికి కారణంగా అనుమానాల నీడలో జీవించాల్సి వస్తే, మరోవైపు కూంబింగ్ ఆపరేషన్లు, శిబిరాల ఏర్పాటు, రహదారుల నిర్మాణంతో గ్రామాల్లో భద్రతా బలగాల కదలికలు పెరిగాయి. దీని ప్రభావంతో కొన్ని చోట్ల గ్రామాలు ఖాళీ కావడం, పంటలు పండించలేకపోవడం, అడవిపై ఆధారపడిన జీవనోపాధులు దెబ్బతినడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. అయితే అదే సమయంలో, మావోయిస్టుల ఒత్తిడి తగ్గడంతో కొంతమంది ఆదివాసీల్లో స్వేచ్ఛగా జీవించే అవకాశం లభిస్తోందన్న అభిప్రాయాలు కూడా ఉన్నాయి. పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు, రహదారులు వంటి అభివృద్ధి పనులు వేగం పుంజుకుంటున్నప్పటికీ, భయం, అభద్రత పూర్తిగా తొలగిపోలేదన్నదే వాస్తవం.

## నదీ జలాలపై సీఎంకు అవగాహన లేదు

**వేద న్యూస్, నల్లగొండ:**

నదీ జలాలు, సాగునీటి అంశాలపై ముఖ్యమంత్రికి పూర్తిస్థాయి అవగాహన లేదని, రాష్ట్ర మంత్రులది అంతులేని అజ్ఞానమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో విమర్శించారు. నల్లగొండ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యుల అభినందన సభలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ సాగునీటి ప్రాజెక్టులపై అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పే సత్తా కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని కేటీఆర్ ఆరోపించారు. అందుకే ప్రజల దృష్టిని మళ్లించేందుకు కేసులు, నోటీసులు, బెదిరింపుల డ్రామాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఇలాంటి చర్యలకు బీఆర్ఎస్ ఎప్పటికీ భయపడదని, తెలంగాణ రైతాంగం కోసం పోరాటం కొనసాగుతూనే ఉంటుందని స్పష్టం చేశారు. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని కావాలనే అడ్డుకుంటూ కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తోందని కేటీఆర్ విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 90 శాతం పనులు పూర్తి చేస్తే, మిగిలిన 10 శాతం పనులను కూడా ఈ రెండేళ్లలో పూర్తి చేయలేకపోయిందని అన్నారు. డీపీఆర్ పంపడంలో విఫలమవడం, ప్రాజెక్టుల పరిధిని కుదించడం ద్వారా తెలంగాణ ప్రయోజనాలకు గండికొడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన '420' హామీల భయంతోనే సహకార సంఘాల ఎన్నికల నుంచి పారిపోతోందని కేటీఆర్ వ్యాఖ్యానించారు. దమ్ముంటే వెంటనే సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని ఆయన సవాల్ విసిరారు. ఎన్నికలు జరిగితే రైతులు కర్రు కాల్చి వాత పెట్టడం ఖాయమని, అందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలంటే భయపడుతోందని అన్నారు. ఓటమి భయంతోనే నామినేటెడ్ పదవుల భర్తీకి దిగిందని విమర్శించారు. కృష్ణా నదీ జలాల విషయంలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపై కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎంకు నదీ జలాలపై అవగాహన లేదని, సాగునీటి శాఖ మంత్రులకు నీళ్లపై కనీస స్పష్టత కూడా లేదని ఎద్దేవా చేశారు. నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాల రైతాంగానికి న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పోరాటం ఆగదని ప్రకటించారు. ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయాలని పార్టీ కార్యకర్తలకు ఆయన పిలుపునిచ్చారు.

## ఇక అంతా డిజిటల్ చెల్లింపులే!




మార్గదర్శకాల ప్రకారం ప్రతి గ్రామ పంచాయతీ లేదా మండల పరిషత్ పేరుపై ప్రత్యేకంగా రెండు బ్యాంకు ఖాతాలు తెరవాల్సి ఉంటుంది. ఒక ఖాతా 15వ ఆర్థిక సంఘం నిధుల కోసం, మరొకటి రాష్ట్ర వాటా గ్రాంట్ల కోసం వినియోగించాలి. ఈ ఖాతాలను ఇతర ప్రభుత్వ పథకాల నిధులతో కలపరాదని ప్రభుత్వం స్పష్టంగా పేర్కొంది. దీనివల్ల నిధుల దుర్వినియోగానికి అవకాశం లేకుండా పర్యవేక్షణ సులభమవుతుందని అధికారులు తెలిపారు. చెల్లింపుల ఆమోదానికి జాయింట్ డిజిటల్ సంతకాల విధానాన్ని ప్రవేశపెట్టారు. ఇందులో రెండు అంచెల వ్యవస్థ అమలు కానుంది. వోచర్ తయారీ బాధ్యత 'మేకర్'గా ఉప–సర్పంచ్ లేదా ఎంపీడీఓకు ఉండగా, తుది ఆమోదం 'చెకర్'గా సర్పంచ్ లేదా మండల పరిషత్ అధ్యక్షుడు ఇవ్వాల్సి ఉంటుంది. ఈ విధానం ద్వారా ఏకపక్ష నిర్ణయాలకు తావు లేకుండా ఉమ్మడి బాధ్యతను నిర్ధారించనున్నారు. నిధుల వినియోగానికి ముందు గ్రామసభ తీర్మానం తప్పనిసరిగా ఉండాలని నిబంధనల్లో పేర్కొన్నారు. కొత్తగా ఏర్పడిన పంచాయతీలు ఎల్‌జీడీ కోడ్‌తో పీఎఫ్ఎంఎస్‌లో నమోదు కావాల్సి ఉంటుంది. అలాగే గ్రామ పంచాయతీలకు సేవలు అందించే విక్రేతలు కూడా పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆదేశించారు. అప్పుడే వారికి చెల్లింపులు జరిగే అవకాశం ఉంటుంది. మొత్తానికి, గ్రామ పంచాయతీ నిధుల నిర్వహణను పూర్తిస్థాయిలో డిజిటల్ పర్యవేక్షణలోకి తీసుకువచ్చే దిశగా ప్రభుత్వం కీలక అడుగు వేసింది. సర్పంచ్‌ఉపసర్పంచ్‌ల ఉమ్మడి డిజిటల్ ఆమోదం, ప్రత్యేక ఖాతాలు, ఆన్‌లైన్ చెల్లింపుల విధానం ద్వారా నిధుల పారదర్శకత పెరిగి, గ్రామీణ పాలనలో విశ్వసనీయత మరింత బలపడనుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

## మానవత్వం చూపిన కవిత

**– ప్రమాదంలో గాయపడిన తండ్రీకుమార్తెకు తక్షణ సహాయం**



**వేద న్యూస్, యాదాద్రి భువనగిరి:**

యాదాద్రి భువనగిరి జిల్లా పర్యటనలో భాగంగా బీబీనగర్ ఎయిమ్స్‌కు వెళ్తున్న సమయంలో నారపల్లి వద్ద అప్రమత్తత, మానవత్వం కలసి కనిపించాయి. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు అభివాదం చేసేందుకు ప్రయత్నించిన తండ్రీకుమార్తె బైక్‌పై నుంచి కింద పడిపోవడంతో స్థానికంగా ఒక్కసారిగా ఆందోళన నెలకొంది. ఈ ఘటనను గమనించిన కవిత వెంటనే తన వాహనాన్ని ఆపి, ప్రమాదంలో గాయపడిన తండ్రీకుమార్తె వద్దకు వెళ్లారు. వారి పరిస్థితిని తెలుసుకుని ఆలస్యం చేయకుండా తన కాన్వాయ్‌లోని వాహనంలో సమీపంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. తక్షణ చర్యలతో బాధితులకు అవసరమైన వైద్య సహాయం అందేలా చర్యలు చేపట్టారు. ఆస్పత్రిలో తండ్రీకుమార్తెలకు ప్రథమ చికిత్స అందేలా తెలంగాణ జాగృతి నాయకులు ఏర్పాట్లు చేశారు. గాయాల తీవ్రతను వైద్యులు పరిశీలించి చికిత్స అందించారు. బాధితుల కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పిన కవిత, పూర్తి చికిత్స అందేలా చూడాలని జాగృతి నాయకులను ఆదేశించారు. ఈ ఘటనలో కవిత చూపిన స్పందన స్థానికుల్లో ప్రశంసలు పొందింది. ప్రజల మధ్య ఉండే నాయకత్వం అంటే మాటలకే పరిమితం కాకుండా, అవసర సమయంలో ముందుకు వచ్చి సహాయం చేయడమేనని ఈ సంఘటన మరోసారి నిరూపించింది. మొత్తానికి, నారపల్లి ఘటనలో తక్షణ స్పందనతో తండ్రీకుమార్తెకు సహాయం చేసిన తీరు మానవత్వానికి నిలువెత్తు ఉదాహరణగా నిలిచింది.

## మెదక్ ఎస్పీకి పదోన్నతి

**వేద న్యూస్, మెదక్ జిల్లా:**




మెదక్ జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస రావు సీనియర్ ఎస్పీగా పదోన్నతి కల్పిస్తూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే. రామకృష్ణ రావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా మంగళ వారం మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయం లో జిల్లా అదనపు ఎస్పీ ఎస్. మహేందర్ ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే డీఎస్పీలు నరేందర్ గౌడ్, సుభాష్ చంద్ర బోస్, ప్రసన్న కుమార్, రంగా నాయక్, సీఐలు, ఎస్సైలు, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఆపత్కాలంలో సారథ్యం వహించిన మహానేత




- కేయూ వీసీ ఆచార్య ప్రతాప్ రెడ్డి
- పీవీకి ఘన నివాళి

**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**

ఆపత్కాలంలో దేశానికి సారథ్యం వహించిన మహానేత, భారతరత్న పీవ నరసింహా రావు అని ఉపకులపతి ఆచార్య ప్రతాప్ రెడ్డి కొనియాడారు. భారతరత్న పీవీ నరసింహా రావు వర్ధంతి సందర్భంగా విశ్వవిద్యాలయ హ్యూమానిటీస్ భవనంలోని పొలిటికల్ సైన్స్ విభాగ సెమినార్ హాల్లో నిర్వహించిన కార్యక్రమానికి కేయూ వీసీ ఆచార్య ప్రతాప్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. ఆర్థిక సంస్కరణల ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థకు పీవీ నరసింహ రావు దిశానిర్దేశం చేశారన్నారు. పీవీ అపర చాణక్యుడిగా ఎన్నో దీర్ఘకాలిక ప్రణాళికలను అమలు చేసి నేటి దేశ ఆర్థిక వ్యవస్థకు మార్గదర్శిగా నిలిచారని చెప్పారు. యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అంతకుముందు పీవీ నరసింహ రావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి విశ్వవిద్యాలయ పి.వి. నాలెడ్జ్ సెంటర్ సంచాలకులు డాక్టర్ జి. కృష్ణయ్య అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో పొలిటికల్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ సంకేనేని వెంకట్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగాధిపతి డాక్టర్ ఆకుతోట శ్రీనివాసులు, బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధక విద్యార్థులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# 12 మంది పిల్లలు.. 5 పందులు!

- తెలంగాణ విద్యారంగంపై నిర్లక్ష్యం
- ఆగ్రహం వ్యక్తం చేసిన కేటీఆర్



**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

తెలంగాణలో ప్రభుత్వ విద్యా వ్యవస్థ ఎంత దయనీయ స్థితికి చేరిందో చూపించే దారుణ చిత్రం మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట మండలం వేములలో వెలుగులోకి వచ్చిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పూర్వప్రాథమిక పాఠశాల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో పందులు స్వేచ్ఛగా తిరుగాడుతుంటే, భోజనం కోసం భయభ్రాంతులకు గురవుతూ 12 మంది చిన్నారులు లైన్లో నిలబడిన దృశ్యం తెలంగాణ ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని వ్యాఖ్యానించారు. పాఠశాల అనేది పిల్లలకు భద్రత, పోషణ, విద్య అందాల్సిన పవిత్ర స్థలం అని కేటీఆర్ గుర్తుచేశారు. అలాంటి చోట పందులు తిరుగాడే పరిస్థితి ఏర్పడటం రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని అన్నారు. ముక్కుపచ్చలారని చిన్నారుల ప్రాణాలతో చెలగాటమాడేలా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆయన మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్ల కాలంలోనే ప్రభుత్వ విద్యాసంస్థల్లో 102 ఫుడ్ పాయిజనింగ్ ఘటనలు జరిగాయని కేటీఆర్ వెల్లడించారు. ఈ ఘటనల్లో 2188 మంది పిల్లలు ఆసుపత్రుల పాలయ్యారని, వివిధ కారణాలతో 118 మంది చిన్నారులు ప్రాణాలు కోల్పోయారని పేర్కొన్నారు. ఇవన్నీ కేవలం గణాంకాలు కావని, తల్లిదండ్రుల గుండెలు పగిలే విషాదాలేనని వ్యాఖ్యానించారు. ఇంతటి దారుణ పరిస్థితులు ఉన్నప్పటికీ రాష్ట్ర కాంగ్రెస్ సర్కారు మాత్రం మొద్దు నిద్రలో ఉందని కేటీఆర్ విమర్శించారు. పిల్లల భద్రత, పోషణ, పరిశుభ్రతపై కనీస శ్రద్ధ చూపకుండా పాలన సాగించడం అమానుషమని అన్నారు. అంగన్‌వాడీలు, పాఠశాలల్లో పరిస్థితులు మెరుగుపడే వరకు ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలని డిమాండ్ చేశారు. మొత్తానికి, వేముల అంగన్‌వాడీ ఘటన తెలంగాణ విద్యారంగంలో కొనసాగుతున్న నేరపూరిత నిర్లక్ష్యానికి ప్రతీకగా మారిందని కేటీఆర్ స్పష్టం చేశారు. చిన్నారుల ప్రాణాల రక్షణే ప్రభుత్వ తొలి కర్తవ్యమని, ఆ బాధ్యతను విస్మరిస్తే ప్రజలు మౌనంగా ఉండరని ఆయన హెచ్చరించారు.

# ట్రిపుల్ ఆర్ పేరుతో భూములు లాక్కుంటున్నారు

ఆమె పేర్కొన్నారు. ట్రిపుల్ ఆర్ ప్రాజెక్టుకు సంబంధించిన ఆలైన్‌మెంట్ ఇప్పటివరకు మూడు సార్లు మారిందని కవిత వెల్లడించారు. ఈ మార్పుల వెనుక పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని ఆమె ఆరోపించారు. కొంతమంది ఎమ్మెల్యేలు తమ భూములు కాపాడుకునేందుకు ఆలైన్‌మెంట్‌ను మార్పిస్తున్నారని, దాని భారం సామాన్య రైతులపై పడుతోందని విమర్శించారు. ప్రజల అవసరాలు పక్కనపెట్టి వ్యక్తిగత ప్రయోజనాల కోసం నిర్ణయాలు తీసుకుంటున్నారని మండిపడ్డారు. ఈ సందర్భంగా ట్రిపుల్ ఆర్ ఆలైన్‌మెంట్‌ను మారుస్తానని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి రాయగిరి ప్రజలకు ఇచ్చిన హామీని కవిత ప్రస్తావించారు. ఆ హామీకి ప్రభుత్వం కట్టుబడి ఉందా లేదా అన్నది ప్రజలకు స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజలకు న్యాయం చేస్తారా? లేక మళ్లీ మోసం చేస్తారా? అనే ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలన్నారు. రాయగిరిలోని రైతులు స్పష్టంగా తమ భూములు ఇచ్చేది లేదని చెబుతున్నారని కవిత తెలిపారు. రైతుల అభిప్రాయాన్ని గౌరవించకుండా భూములు లాక్కుంటే తీవ్ర ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. ప్రజల పక్షాన నిలబడి, రాయగిరి రైతుల హక్కుల కోసం తెలంగాణ జాగృతి తరఫున పోరాటం కొనసాగుతుందని కవిత స్పష్టం చేశారు.

# 200 ఏళ్లు చెక్కు చెదరకుండా పనులు

**వేద న్యూస్, మేడారం ప్రతినిధి:**

మేడారం మహాజాతరను దృష్టిలో ఉంచుకుని చేపట్టిన అన్ని అభివృద్ధి పనులను అనుకున్న సమయానికి పూర్తి చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. తాత్కాలిక పనులు కాకుండా, కనీసం 200 సంవత్సరాలు చెక్కుచెదరకుండా ఉండేలా శాశ్వత అభివృద్ధి పనులను చేపట్టామని తెలిపారు. ఆదివాసీ గిరిజనుల ఆచారాలు, సంప్రదాయాలు, మనోభావాలకు ఎలాంటి భంగం కలగకుండా పనులు సాగుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. మేడారం జాతరకు రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి లక్షలాదిమంది భక్తులు వచ్చి శ్రీ సమ్మక్క సారలమ్మలను దర్శించుకుంటారని మంత్రి గుర్తుచేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ప్రాంగణం, గద్దెల ప్రాంతాలు, రహదారులు, మౌలిక సదుపాయాలను విస్తృతంగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. మంగళవారం మంత్రి ధనసరి అనసూయ సీతక్క, ముఖ్యమంత్రి సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటిడిఏ పీవో చిత్ర మిశ్రా, డీఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్‌తో కలిసి మేడారంలో జరుగుతున్న అభివృద్ధి పనులను మంత్రి పరిశీలించారు. సమ్మక్క సారలమ్మ ఆలయ అభివృద్ధి పనులు, సాండ్‌స్టోన్ శిల్పాల లిపి చిత్రాలు, క్యూ లైన్ నిర్మాణం, గోవిందరాజు–పగిడిద్దరాజుల గద్దెల పనులు, ఆలయ ఫ్లోరింగ్, ప్రహరీలో వెదురు బొంగు ఆకృతిలో ఏర్పాటు చేస్తున్న స్తంభాలు, చిలుకలగుట్ట రోడ్డు, స్తూపం, కన్నెపల్లి, జంపన్నవాగు, ఆర్టీసీ బస్ స్టేషన్ పరిసరాల్లో జరుగుతున్న పనులను మంత్రి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం మేడారం హరిత హోటల్‌లో సంబంధిత శాఖల ఉన్నతాధికారులు, గుత్తేదారులతో సమీక్ష సమావేశం నిర్వహించి పనుల పురోగతిపై కూలంకషంగా చర్చించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. డిసెంబర్ 31వ తేదీ లోపు ఆలయ ప్రాంగణ పనులు, రాత్రి నిర్మాణాలు, సివిల్ వర్క్స్, గద్దెల చుట్టూ గ్రిల్స్, ప్రాకారం బయట సీసీ రోడ్లను పూర్తి చేయాలని ఆదేశించారు. ఇతర అభివృద్ధి పనులు జనవరి 5వ తేదీ లోపు పూర్తి చేయాలని, ప్రధాన ద్వారం పనులు కూడా అదే గడువులో ముగించాలని సూచించారు. ఆలయ ప్రాంగణం, గద్దెల పరిసరాలు, రహదారుల వెంట లైటింగ్ పనులు వేగంగా పూర్తిచేయాలని, గద్దెలకు చేరుకునే హరిత వై జంక్షన్ నుంచి గద్దెల వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని తెలిపారు. దేశవ్యాప్తంగా కోట్లాది మంది భక్తులు వచ్చే మేడారం మహాజాతరకు ఈసారి గతంతో పోలిస్తే దాదాపు 200 శాతం ఎక్కువ మంది వచ్చే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. అందుకు అనుగుణంగా రహదారుల విస్తరణ, 29 ఎకరాల భూసేకరణతో విశాల ప్రదేశాల ఏర్పాటు, శాశ్వత అభివృద్ధి పనులు చేపడుతున్నామని వివరించారు. అధికారులంతా పట్టుదలతో సమన్వయంతో పనిచేసి నిర్ణీత గడువుల్లో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ఆదివాసీ గిరిజనుల అస్తిత్వాన్ని కాపాడుతూ ఆలయ పునరుద్ధరణ పనులు సాగుతున్నాయని తెలిపారు.

# ఎక్సైజ్ శాఖలో డీపీసీ ద్వారా 53 మందికి పదోన్నతులు

**హైదరాబాద్ వేద న్యూస్:**

ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖలో డీపీసీ (డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీ) ద్వారా 53 మంది అధికారులకు పదోన్నతులు వచ్చాయి. సోమవారం జరిగిన సమావేశంలో డీపీసీ ఛైర్మన్ వికాస్‌రాజ్, జెడీ కన్వీనర్ సెక్రటరీ బెనహార్ మహేష్ దత్ ఎక్క, డీపీసీ మెంబర్స్, ప్రిన్సిపల్ సెక్రెటరీ రఘునందన్‌రావు, ఎక్సైజ్ కమిషనర్ సీ హరికిరణ్, ఇండస్ట్రియల్ సెక్రెటరీ సంజయ్ కుమార్.. 53 మంది ఎక్సైజ్ అధికారుల పదోన్నతుల కోసం సిఫారసు చేశారు. అడిషనల్ కమిషనర్లుగా ఇద్దరికి, జాయింట్ కమిషనర్లుగా ఇద్దరికి, డిప్యూటీ కమిషనర్లుగా 12 మందికి, అసిస్టెంట్ కమిషనర్లుగా 14 మందికి, ఎక్సైజ్ సూపరింటెండ్‌లుగా 23 మందికి డీపీసీ ద్వారా పదోన్నతులు వచ్చాయి. ఈ పదోన్నతులపై ప్రభుత్వం ఒకటి రెండు రోజుల్లో జీవో జారీ చేయనుందని తెలిసింది. పదోన్నతులు వచ్చిన అధికారులందరూ మంగళవారం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ సీ హరికిరణ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతులు తెలిపారుప్రియ, ఉజ్వలరెడ్డి, జీవన్ కిరణ్‌లు ఉన్నారు.

# దక్షిణ మధ్య రైల్వే కీలక నిర్ణయం

- ప్రయాణికుల భద్రత, సౌకర్యం మరింత మెరుగు
- రెండు ఇంటర్‌సిటీ రైళ్లకు ఆధునిక ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు

**వేద న్యూస్, తిరువనంతపురం:**



ప్రయాణికుల భద్రత, సౌకర్యం, ప్రయాణ నాణ్యతను మరింత మెరుగుపరచే దిశగా దక్షిణ మధ్య రైల్వే కీలక నిర్ణయం తీసుకుంది. తిరువనంతపురం – తిరుచి రాపలి ్లి– తిరువనంతపురం ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్, అలాగే తిరువనంతపురం–గురువాయూర్–తిరువనంతపురం ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైళ్లలో కొత్త తరహా ఎల్‌హెచ్‌బీ కోచ్‌లను ప్రవేశపెట్టింది. ఈ రెండు రైళ్లలో ఒక రేక్‌ను ఎల్‌హెచ్‌బీ కోచ్‌లతో నడపనుండగా, రేక్ షేరింగ్ విధానంలో ఈ మార్పు అమలు చేస్తున్నారు. ఆధునిక భద్రతా ప్రమాణాలు కలిగిన ఈ కోచ్‌లతో ప్రయాణికులకు మెరుగైన రైడ్ క్వాలిటీ, తక్కువ శబ్దం, అధిక స్థిరత్వం లభిస్తుందని రైల్వే అధికారులు తెలిపారు. ప్రమాదాల సమయంలో ప్రయాణికుల రక్షణకు ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు మరింత భద్రమని పేర్కొన్నారు. మిగిలిన మరో రేక్ మాత్రం ప్రస్తుతం అమలులో ఉన్న షెడ్యూల్ ప్రకారమే ఐసీఎఫ్ కోచ్‌లతో కొనసాగుతుందని దక్షిణ రైల్వే స్పష్టం చేసింది. ప్రయాణికుల సౌకర్యాలపై ప్రభావం పడకుండా దశలవారీగా కోచ్‌ల మార్పు చేపడుతున్నామని అధికారులు తెలిపారు. ఎల్‌హెచ్‌బీ కోచ్‌ల ప్రవేశంతో ఈ మార్గాల్లో ప్రయాణించే ప్రయాణికులకు మరింత సౌకర్యవంతమైన, భద్రమైన ప్రయాణ అనుభవం లభించనుందని రైల్వే వర్గాలు అభిప్రాయపడ్డాయి. ముఖ్యంగా రోజువారీ ప్రయాణికులు, వృద్ధులు, కుటుంబాలతో ప్రయాణించే వారికి ఈ మార్పు ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొన్నారు. మొత్తానికి, దక్షిణ రైల్వే చేపట్టిన ఈ చర్య ప్రయాణికుల భద్రత, సౌకర్యాలపై సంస్థ చూపుతున్న ప్రాధాన్యతకు నిదర్శనంగా నిలుస్తోంది. రానున్న రోజుల్లో మరిన్ని రైళ్లకు ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు ప్రవేశపెట్టే అవకాశం ఉందని సమాచారం.

# పీజీ మూడో సెమిస్టర్ పరీక్షలు వాయిదా


**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**

యూజీసీ నెట్, టీజీ సెట్, టీజీ టెట్ పరీక్షలను దృష్టిలో ఉంచుకుని, జనవరి 3వ తేదీ నుంచి నిర్వహించాల్సిన కాకతీయ విశ్వవిద్యాలయ పీజీ మూడవ సెమిస్టర్ పరీక్షల షెడ్యూల్ను వాయిదా వేస్తున్నట్లు విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య రాజేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. వాయిదా వేసిన పీజీ మూడవ సెమిస్టర్ పరీక్షల తేదీలను సవరించిన షెడ్యూల్ను త్వరలో ప్రకటించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. డిసెంబర్ 27వ తేదీ నుంచి ప్రారంభం కావలసిన ఎంబీఏ, ఎంసీఏ మూడవ సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేసినట్టు, వాటిని తిరిగి ఎప్పుడు నిర్వహించేది త్వరలో ప్రకటిస్తామని పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య రాజేందర్ ఒక ప్రకటనలో తెలిపారు

# తల్లి, తండ్రి దీవెనే శ్రీరామ రక్ష

- బోయినిపల్లి సర్పంచ్ నల్ల మోహన్

**వేద న్యూస్, బోయినిపల్లి:**



తండ్రి దీవెనే నాకు శ్రీరామరక్ష అయిందని బోయినిపల్లి సర్పంచ్ నల్లమోహన్ అన్నారు. మంగళవారం నాడు బోయినిపల్లిలోని తన నివాసంలో సర్పంచ్ తో పాటు ఆయన తల్లిదండ్రులను టీడబ్ల్యూజేఎఫ్, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు, సీనియర్ జర్నలిస్ట్ నల్గొండ సత్తయ్య గౌడ్ సన్మానించారు. ఈ సందర్భంగా మోహన్ మాట్లాడుతూ.. తన తల్లి, తండ్రి ఎన్నికల్లో పోటీ చేయడానికి తోడు నీడగా దీవెనలు అందిస్తూ పని చేశారన్నారు. గ్రామ అభివృద్ధి కోసం కృత నిశ్చయంతో పని చేస్తానని తెలిపారు. అలాగే మండల జర్నలిస్టుల కోసం వారి సమస్యల సాధన కోసం తన వంతు సహకారం అందిస్తానన్నారు. ఈ సందర్భంగా జర్నలిస్ట్ ల సంఘం అధ్యక్షుడు నలగొండ సత్తయ్య గౌడ్ మాట్లాడుతూ.. కొందరి జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు వచ్చాయని, మరి కొంతమంది జర్నలిస్టుల ఇళ్లస్థలాల కోసం మీ సహకారం అందిస్తూ.. వారికి ఇండ్ల స్థలాలు అందే విధంగా చూడాలని సర్పంచ్ కు విజ్ఞప్తి చేశారు.

# కేయూ పురుషుల బాస్కెట్ బాల్ జట్టు ఎంపిక

**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**




డిసెంబర్ 24 నుంచి 28 మధ్య చెన్నైలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీ లో జరిగే బాస్కెట్ బాల్ (పురుషుల) సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్ కు కాకతీయ విశ్వ విద్యాలయం జట్టు ఎంపికైంది. వీరిలో కేయూ వ్యాయమ కళాశాల నుంచి సీహెచ్ జయచంద్ర, హనంకొండ యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ నుంచి కే.భరత్ రాజ్, హనంకొండ వాగ్దేవి డిగ్రీ కాలేజీ నుంచి కే. యశ్వంత్, కే.సుధాకర్, విఘ్నేశ్, హనంకొండ కిట్స్ కాలేజీ నుంచి జి. దినేష్ కుమార్, టి. మాయార్ రాజ్, ఎస్. తారకేష్ యాదవ్, హనంకొండ గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ నుంచి ఎం.శ్రీహరి, బి.ఈశ్వర్, ఖమ్మం ఎస్ఆర్అండ్ బీజీఎన్ఆర్ కాలేజీ నుంచి ఆర్. నరేందర్, మహబూబాబాద్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ నుంచి పి.అవినాష్ ఉన్నట్లు వీరికి కోచ్ గా హన్మకొండ గీతాంజలి డిగ్రీ కళాశాల వ్యాయమ అధ్యాపకులు ఇర్ఫాన్ మహమ్మద్, ఈ జట్టుకు మేనేజర్ గా కేయూ వ్యాయమ కళాశాల అధ్యాపకులు డాక్టర్ పి.భాస్కర్ ఉన్నారు.

# జీవాలకు నట్టల నివారణ మందు పంపిణీ

**వేద న్యూస్, దామరచర్ల:**



గొర్రెలు ,మేకల కు కాపరులు తప్పక నట్టల నివారణ మందును త్రాగించాలని మండల పశువైద్యాధికారి సందీప్ కుమార్ మంగళవారం ఒక ప్రకటన లో తెలిపారు. దామచర్ల తోపాటు కొండ్రపోలు గ్రామాల పరిధిలో మంగళవారం 3 వేల గొర్రెలు మేకలకు నట్టల నివారణ మందును త్రాగించినట్లు ఆయన చెప్పారు. ఇతర గ్రామాల్లో కూడా నట్టల నివారణ మందు పంపిణీ జరుగుతున్నందున కాపరులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కిరణ్ ,సొసైటీ అధ్యక్షుడు జిడియ్య ,తదితరులు పాల్గొన్నారు.

వేద న్యూస్

బుధవారం డిసెంబర్ 24, 2025

# పెసా యాక్ట్‌పై అవగాహన కార్యక్రమం

**వేద న్యూస్, కాసిపేట:**

పెసా యాక్ట్ దినోత్సవాన్ని పురస్కరించుకొని కాసిపేట మండలంలోని ఆదివాసీ గ్రామాలు, ఏజెన్సీ గ్రామాలలో పెసా యాక్ట్ పై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గిరిజనుల హక్కులు, గ్రామసభల అధికారాలు, స్వయంపాలన విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యంగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా పెసా యాక్ట్ ద్వారా గ్రామసభలకు కల్పించిన అధికారాలు, అటవీ వనరుల పరిరక్షణ, భూమి హక్కులు, సంప్రదాయ ఆచారాల రక్షణ వంటి అంశాలపై వివరించనున్నారు. అలాగే ఆదివాసీ ప్రజలు తమ హక్కులను తెలుసుకొని వాటిని సమర్థవంతంగా వినియోగించుకునేలా మార్గనిర్దేశం చేయనున్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, గిరిజన సంఘాల నాయకులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొని ప్రసంగించనున్నారు. ఆదివాసీ గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

# ఫర్టిలైజర్ యాప్ పై రైతులకు అవగాహన

**వేద న్యూస్, దామరచర్ల :**



రైతులందరు ఫర్టిలైజర్ యాప్ ను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఋషేంద్ర మణి కోరారు. మండలం లోని వీర్లపాలెం గ్రామ రైతువేధిక లో యాప్ గూర్చి రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. యూరియా దుర్వినియోగం కాకుండా ,రైతులందరికీ అందేం దుకు గాను ప్రభుత్వం ప్రత్యేక యాప్ ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ముందుగా రైతులు గూగుల్ ప్లే స్టోర్ నుండి యాప్ ను డౌన్లోడ్ చేసుకొని అందులో తమ వివరాలను నమోదు చేసిన తర్వాత, 24గం.లల్లో యూరియా తీసుకెళ్లాలని చెప్పారు.యూరియా డీలర్లు ప్రతి వివరాలను యాప్ లో నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నేనవత్ శ్రావణి నాగు , ఏఈఓ ప్రియాంక, పార్వతీ, రైతులు వెంకట్ రెడ్డి, పుల్ల రెడ్డి తిరుపతి రెడ్డి,అప్పి రెడ్డి, కృష్ణ రెడ్డి గోవింద రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కేయూలో ప్రీ క్రిస్మస్ వేడుకలు

**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**




ప్రేమ, శాంతి, త్యాగానికి ప్రతీక క్రిస్మస్ పండుగని కాకతీయ యూని వర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి అన్నారు. విశ్వ విద్యాలయ ఉద్యోగులు నిర్వహించిన ముందస్తు క్రిస్మస్ వేడుకలలో పాల్గొని, కేక్ కట్ చేసి ప్రసంగించారు. పండుగల ద్వార సోదర భావం పెంపొందు తుందన్నారు. ఏసుక్రీస్తు బోధనలు నేటికి ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# క్రిస్మస్ వేడుకలకు 500 మందితో బందోబస్తు

- కమాండ్ కంట్రోల్ ఏర్పాటు.. సీసీ కెమెరాలతో నిఘా
- ఆకతాయిలపై షీ టీం.. - జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు



**వేద న్యూస్, మెదక్ జిల్లా:**

మెదక్ జిల్లా క్రిస్మస్ వేడుకల సందర్భంగా మెదక్‌లోని ప్రసిద్ధ చర్చ్‌ను భారీ సంఖ్యలో భక్తులు సందర్శించనున్న నేపథ్యంలో శాంతిభద్రతలు కాపాడేందుకు పోలీస్ శాఖ విస్తృత ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస రావు తెలిపారు. పోలీస్ సిబ్బందిని 4 సెక్టార్‌లుగా, మూడు షిఫ్ట్‌లుగా విభజించి, నిరంతర పర్యవేక్షణ లో మొత్తం 496 మంది అధికారులు, సిబ్బందితో పటిష్టమైన బందోబస్తు విధులు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. బందోబస్తును కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా సీసీ కెమెరాల సహాయంతో నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు. జాతరకు వచ్చే భక్తులు తమ వాహనాలను ఎక్కడపడితే అక్కడ నిలపకుండా, పార్కింగ్‌కు కేటాయించిన స్థలాల్లోనే నిలపాలని సూచించారు. అలాగే తమతో తీసుకువచ్చే వస్తువులను జాగ్రత్తగా ఉంచు కోవాలని, అపరిచి తులను నమ్మి విలువైన వస్తువులు ఇవ్వ కూడదని సూచించారు. జాతర లో ఆకతాయిల నియంత్రణ కోసం షీ టీంలు, మఫ్టీ పార్టీలతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎవరైనా చిన్నారులు తప్పిపోయి నట్లయితే చర్చ్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక పోలీస్ కంట్రోల్ రూమ్‌లో సమాచారం ఇవ్వాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు తెలియ జేయాలని కోరారు. భద్రతలో భాగంగా బీడీ టీమ్‌లు, డాగ్ స్క్వాడ్‌లు మోహరించామని, భద్రత విషయంలో ఎలాంటి రాజీ లేకుండా కట్టుది ట్టమైన చర్యలు చేపట్టామని తెలిపారు. చివరగా జిల్లా ప్రజలకు ఎస్పీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా అదన పు ఎస్పీ,ఎస్ మహేందర్, డియస్పి లు ప్రసన్న కుమార్, నరేందర్ గౌడ్, రంగా నాయక్, సీఐ లు, ఎసై లు సిబ్బంది పాల్గొన్నారు.

# నోబెల్ విజేతకు రూ.100 కోట్ల ప్రోత్సాహం





- క్వాంటమ్ టెక్నాలజీతో ఆరోగ్య రంగంలో విప్లవాత్మక మార్పులు
- ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ పటంలో నిలబెడతాం
- ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు

**వేద న్యూస్, అమరావతి ప్రతినిధి:**

ఆంధ్రప్రదేశ్‌ను ఆధునిక విజ్ఞాన, సాంకేతిక శక్తికేంద్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వ్యక్తి నోబెల్ బహుమతి సాధిస్తే రూ.100 కోట్ల నగదు ప్రోత్సాహకం అందజేస్తామని ఆయన ప్రకటించారు. ఇదే విధంగా క్వాంటమ్ టెక్నాలజీ రంగంలో ప్రపంచస్థాయి ఘనత సాధించినా అదే స్థాయిలో ప్రోత్సాహకం అందిస్తామని తెలిపారు. జ్ఞానం, పరిశోధన, ఆవిష్కరణలకు ప్రభుత్వం ఇస్తున్న అత్యున్నత ప్రాధాన్యతకు ఇది నిదర్శనమని సీఎం పేర్కొన్నారు. రాజధాని అమరావతిలో ప్రపంచ స్థాయి క్వాంటమ్ వ్యాలీని అభివృద్ధి చేస్తున్నామని సీఎం వెల్లడించారు. రెండేళ్లలోనే అమరావతి లో క్వాంటమ్ కంప్యూటింగ్ పరికరాల తయారీ ప్రారంభించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. భవిష్యత్తులో క్వాంటమ్ నిపుణులు, కంప్యూటర్లు, పరికరాలను ప్రపంచ దేశాలకు సరఫరా చేసే కేంద్రంగా ఆంధ్రప్రదేశ్‌ను మార్చాలని ప్రభుత్వం సంకల్పించిందన్నారు. క్వాంటమ్ టెక్నాలజీ ద్వారా ఆరోగ్యరంగంలో విప్లవాత్మక మార్పులు సాధ్యమని సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. వ్యక్తిగత అవసరాలకు అనుగుణమైన మందుల అభివృద్ధి, వ్యాధుల ముందస్తు గుర్తింపు, నివారణ -చికిత్సా విధానాల్లో వేగం, ఖచ్చితత్వం, సమర్థత పెంచేలా క్వాంటమ్ అప్లికేషన్లు ఉపయోగించనున్నట్లు చెప్పారు. ఇది ప్రజారోగ్య వ్యవస్థను పూర్తిగా కొత్త దశకు తీసుకెళ్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. క్వాంటమ్ రంగంలో లక్ష మందికి పైగా నిపుణులను తయారు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం వెల్లడించారు. నవంబర్ 13న ప్రకటించిన క్వాంటమ్ కార్యక్రమానికి విశేష స్పందన వచ్చిందని, ఒక్క ప్రకటనతోనే 54 వేలకుపైగా నమోదు జరిగిందని తెలిపారు. ఇప్పటికే నమోదు చేసుకున్న అభ్యర్థులకు శిక్షణా కార్యక్రమాలు చేపట్టి ఐటీ, కృత్రిమ మేధ, క్వాంటమ్ టెక్నాలజీ సమన్వయంతో కొత్త అవకాశాలు సృష్టించనున్నట్లు చెప్పారు. క్వాంటమ్ అల్గారిథమ్స్ నేర్చుకోవడం ద్వారా విద్యార్థులు భవిష్యత్ ప్రపంచానికి నాయకులుగా ఎదగగలరని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. దీర్ఘకాలిక విజయం కోసం యువత ఈ విజన్‌ను స్వీకరించాలని సూచించారు. రాష్ట్రాన్ని సాంకేతికంగా అగ్రగామిగా నిలబెట్టడంలో విద్యార్థుల పాత్ర కీలకమని స్పష్టం చేశారు. మొత్తంగా నోబెల్ ప్రోత్సాహకం నుంచి క్వాంటమ్ వ్యాలీ నిర్మాణం వరకు సీఎం చంద్రబాబు నాయుడు ప్రకటించిన ఈ విజన్ ఆంధ్రప్రదేశ్‌ను భవిష్యత్ సాంకేతిక రాజధానిగా మార్చే దిశగా కీలక అడుగుగా మారిందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# ప్రపంచ సముద్ర పటంలో మళ్లీ అగ్రస్థానంలో విశాఖ

- 2026లో ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ, మిలాన్ విన్యాసం, ఐఒఎన్ఎస్‌కు ఆతిథ్యం



**వేద న్యూస్, విశాఖపట్నం ప్రతినిధి:**

ప్రపంచ సముద్ర శక్తుల దృష్టి మరోసారి విశాఖపట్నంపై కేంద్రీ కృతమవుతోంది. 2026 సంవత్సరంలో జరిగే ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ విశాఖకు రానుండటంతో పాటు, ఎక్సర్‌సైజ్ మిలాన్, ఇండియన్ ఓషన్ నావల్ సింపోజియం కార్యక్రమాలు కూడా ఒకేసారి ఇక్కడే నిర్వహించ నున్నారు. ఇది భారతదేశ చరిత్రలోనే అతిపెద్ద సముద్ర సంబంధిత సమావేశాల్లో ఒకటిగా నిలవనుంది. ఈ మహత్తర సముద్ర విన్యాసాలు, సమావేశాల ద్వారా ప్రపంచంలోని అనేక దేశాల నౌకాదళాలు విశాఖకు చేరుకోనున్నాయి. వివిధ దేశాల యుద్ధ నౌకలు, నౌకాదళాధికారులు, రక్షణ నిపుణులు ఒకే వేదికపై కలుసుకునే అరుదైన అవకాశం ఇది. సముద్ర భద్రత, సహకారం, వ్యూహాత్మక భాగస్వామ్యంపై చర్చలు జరగనుండగా, అంతర్జాతీయ స్థాయిలో భారత నౌకాదళ శక్తి స్పష్టంగా ఆవిష్కృతమవుతుంది. ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ అనేది కేవలం నౌకాదళ ప్రదర్శన మాత్రమే కాదు. ఇది దేశాల మధ్య నమ్మకం, సహకారం, శాంతి సంకల్పానికి ప్రతీకగా నిలుస్తుంది. అలాగే మిలాన్ విన్యాసం ద్వారా సంయుక్త నౌకాదళ విన్యాసాలు, సముద్ర భద్రతా సామర్థ్యాల ప్రదర్శన జరుగనుండగా, ఇండియన్ ఓషన్ నావల్ సింపోజియం ద్వారా హిందూ మహాసముద్ర ప్రాంత దేశాల మధ్య వ్యూహాత్మక సంభాషణ మరింత బలపడనుంది. విశాఖపట్నం ఇప్పటికే తూర్పు తీర నౌకాదళ ప్రధాన కేంద్రంగా, భారత నౌకాదళానికి కీలక స్థావరంగా గుర్తింపు పొందింది. ఇప్పుడు ఈ అంతర్జాతీయ కార్యక్రమాలతో విశాఖ ప్రపంచ సముద్ర వేదికపై మరింత బలమైన గుర్తింపును సంపాదించనుంది. మౌలిక సదుపాయాలు, పోర్టు సామర్థ్యం, భౌగోళిక ప్రాధాన్యం కలిసి విశాఖను భారత్‌కు సముద్ర ద్వారంగా నిలబెడుతున్నాయి. మొత్తానికి, 2026లో విశాఖపట్నం ప్రపంచ నౌకాదళాల సంగమ కేంద్రంగా మారనుంది. సముద్ర శక్తి, అంతర్జాతీయ సహకారం, భారత నాయకత్వాన్ని ఒకేసారి ప్రపంచానికి చాటే వేదికగా విశాఖ నిలవబోతోంది. నిజంగా చెప్పాలంటే విశాఖ కేవలం ఒక నగరం కాదు, దేశానికి సముద్ర ద్వారం.

# ఘనంగా ముందస్తు క్రిస్మస్ వేడుకలు

- ఫాదర్ కొలంబో పాఠశాలలో..

**వేద న్యూస్,, స్టేషన్ ఘనపూర్:**




మండల కేంద్రంలోని ఫాదర్ కొలంబో( సిబిఎస్ఈ) పాఠశాల లో ముందస్తు క్రిస్మస్ వేడు కలు మంగళవారం ఘనం గా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు క్రీస్తు జయంతి నేపథ్యాన్ని కళ్లకు కట్టినట్టుగా ప్రదర్శిస్తూ ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. ప్రభు జన్మకు సంబంధించిన సంఘటనలను నాటక రూపంలో చూపించి సందర్శకులను ఆకట్టుకున్నారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఫాదర్ చిన్నయ్య మాట్లాడుతూ.. క్రీస్తు జయంతి లోకానికి ఒక మహత్తర పర్వదినమని తెలిపారు. ప్రభు జన్మ ద్వారా ప్రేమ, శాంతి, సమాధానం అనే విలువలు సమాజానికి అందాయని, వాటిని ప్రతి ఒక్కరూ తమ జీవనంలో ఆచరించి పొరుగు వారితో పంచుకోవాల్సిన అవసరం ఉందని సందేశం ఇచ్చారు.క్రిస్మస్ సందేశాన్ని ప్రతిబింబించేలా నిర్వహించిన ఈ వేడుకలు పాఠశాల ప్రాంగణంలో ఉత్సాహభరిత వాతావరణాన్ని నెలకొల్పాయి.ఈ వేడుకల్లో ఫాదర్ కొలంబో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఫాదర్ థామస్ కిరణ్‌తో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# పైడిపల్లిలో మైసమ్మ ఆలయం కూల్చివేత

- ఆలయ నిర్మాణ దాత బొల్లం రవి ఆత్మ హత్యాయత్నం
- ఆలయ కూల్చివేతను ఖండించిన బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్
- ఇస్కాన్ టెంపుల్ వద్ద ములుగు రహదారిపై నిరసన

**వేద న్యూస్, వరంగల్:**



పైడిపల్లి గ్రామంలో మైసమ్మ ఆలయాన్ని అధికారులు తొలగించడం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. బిజెపి జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ దీనిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ మంగళవారం ఆందోళనలు చేపట్టారు. కూల్చివేసిన ఆలయాన్ని వెంటనే పునర్నిర్మించాలని, బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని గంట రవికుమార్ డిమాండ్ చేశారు. మైసమ్మ ఆలయాన్ని కూల్చడం మహాపాపమని , ఇది ప్రజల నమ్మకాన్ని అవమానపరచడం అన్నారు.పైడిపల్లి లో జరిగిన ఈ ఘటన చర్చనీయాంశంగా మారింది. ఇస్కాన్ టెంపుల్ వద్ద ములుగు రహదారిపై బిజెపి శ్రేణులు స్థానికులు నిరసన తెలిపారు.ఆలయ నిర్మాణ దాత బొల్లం రవి ఆత్మ హత్యాయత్నం చేయగా, ఆస్పత్రిలో ఉన్న ఆయనను రవికుమార్ పరామర్శించారు.!

# వైభవోపేతంగా మహా పడిపూజ

**వేద న్యూస్, గ్రేటర్ వరంగల్:**



సదా మణికంఠ మిత్ర మండలి రామన్నపేట, పాపయ్య పేట, నేతాజి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి మహా పడిపూజ కన్నుల పండుగగా మంగళవారం జరిగింది. ధర్మశాస్త్ర అయ్యప్ప అన్నప్రసాద సేవా సమితి సారధ్యంలో అష్టాదశ (18) కలాశాలతో దివ్యా భిషేక క్రతువు పూరించారు. పడి పూజల్లో భాగంగా గణపతిదేవుణ్ణి,అయ్యప్ప స్వామిని, లక్ష్మీ దేవిలను పలు రకాల పూలు, పండ్లతో దేవత ప్రతిమలను అత్యంత సుందర ప్రాయంగా అలంకరించి పూజ కార్యక్రమం ప్రారంభించారు. అలంకార ప్రియుడైన శబరిగిరిశుణ్ణి గంధం తో అలంకరించి, పాలు, నెయ్యి, పండ్లతో స్వామి వారికి అభిషేకం చేసి స్వామి వారిని స్మరిస్తూ పాటలు పాడుతూ డప్పు చప్పులతో, భక్తుల కరతాళధ్వానులతో ఆ ప్రాంతమంతా అయ్యప్ప శరణుగోషతో మార్మోగిపోయింది. స్వామీవారి మాల ధారులతో పాటు భక్తులంతా భక్తీ పారవశ్యంలో మునిగితేలారు. అనంతరం అయ్యప్ప స్వాములకు మరియు సాధారణ భక్తులకు కూడా అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో రామన్న పేట, పాపయ్య పేట , రాజీవ్ కాలిని మరియు చుట్టూ పక్కల ప్రాంత ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులయ్యారు. పూజకు వచ్చిన స్వాములకు భక్తితో భిక్షను యేర్పాటు చేసి మాలధారుల ఆశీస్సులు పొందడం, అందరికి అన్నదానం చేయడం వల్ల ఆధ్యాత్మికత పెరిగి పుణ్యం ప్రబోధిల్లుతుందని శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప ఫ్రెండ్స్, ఫ్యామిలీ కార్పొరేషన్ (రామన్న పేట, పాపయ్య పేట) సభ్యులు తెలిపారు.

వేద న్యూస్

బుధవారం డిసెంబర్ 24, 2025

# వికసిత్ భారత్ పేరుతో నియంతృత్వ చట్టాలు



- విబిజి రామ్ జి పథకాన్ని రద్దు చేయాలని నిరసన
- చట్ట ప్రతులు దహనం

**వేద న్యూస్, వరంగల్:**

గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించే చట్టబద్ధ హక్కును తీసివేసే కుట్రలో భాగంగానే కేంద్ర ప్రభుత్వం వికసిత్ భారత్ రోజుగార్ అజివిక మిషన్ గ్రామీణ్ (విబిజి రామ్ జీ) చట్టాన్ని తీసుకువచ్చిందని, తక్షణమే ఈ చట్టాన్ని రద్దు చేసి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని లేకపోతే దారిద్ర రేఖకు దిగువనున్న పేదలకు తీవ్రమైన నష్టం చేకూరుతుందని ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ గ్రేటర్ కార్యదర్శి రాచర్ల బాలరాజు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గన్నారపు రమేష్ తెలిపారు. వామపక్ష పార్టీల పిలుపుమేరకు కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వికసిత్ భారత్ జి రామ్ జి అనే నూతన చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ.. మంగళవారం వరంగల్ హెడ్ పోస్ట్ ఆఫీస్ సెంటర్లో ప్లే కార్డ్స్ ధరించి నిరసన వ్యక్తం చేస్తూ చట్ట ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎంసిపిఐ(యు) నగర కార్యదర్శి మాలోత్ సాగర్ అధ్యక్షతన జరిగిన నిరసనలో వారు మాట్లాడుతూ.. రాజ్యాంగంలోని 41 వ అధికరణ ప్రకారం ఉపాధి హక్కు కు అనుగుణంగా 2005 సంవత్సరంలో కమ్యూనిస్టుల పోరాట ఫలితంగా అప్పటి ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని తీసుకువచ్చిందని చెప్పారు. ఈ క్రమంలో గత 20 సంవత్సరాలుగా దేశవ్యాప్తంగా పేదలు కూలీలు ఉపాధి పొందుతూ.. జీవన భృతి కొనుగోలు శక్తి కలిగి ఉంటున్నారని వివరించారు. ఇలాంటి పరిస్థితుల్లో 100 రోజులు పని దినాలు గ్యారెంటీ కలిగిన చట్టాన్ని 200 రోజులకు పెంచి దినసరి కూలీ పెరిగిన ధరలకు అనుగుణంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తుంటే.. ఉన్న చట్టాన్ని నిర్వీర్యపరుస్తూ వి బి జి రామ్ జి పేరుతో అనేక ఆంక్షలతో చట్టాన్ని రూపొందించి.. రాజ్యాంగ ఉల్లంఘనకు కేంద్ర ప్రభుత్వం పాల్పడుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. పైగా 90 శాతం నిధులను కేంద్రం కేంద్రం ఇస్తుండగా.. ప్రస్తుత నూతన చట్టం ప్రకారం కేవలం 60 శాతం మాత్రమే ఇస్తుందని 40 శాతం రాష్ట్రం భరించాలని పని దినాలను ప్రభుత్వాలే నిర్ణయిస్తాయని విచక్షణ అధికారాలను తమ గుప్పిట్లో ఉంచుకోవడం అంటే తన బాధ్యతల నుంచి తప్పుకోవడమే అని విమర్శించారు. పేదలకు వ్యవసాయ కూలీలకు నష్టం కలిగించే నూతన కేంద్ర చట్టాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని.. లేకపోతే దేశవ్యాప్తంగా ప్రజా ఆందోళనలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంసిపిఐ(యు) నగర కార్యదర్శి మాలోత్ సాగర్, జిల్లా నగర సహాయ కార్యదర్శి నర్ర ప్రతాప్ సుంచు జగదీశ్వర్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ముక్కెర రామస్వామి ఏరియా కార్యదర్శులు మహమ్మద్ మెహబూబ్ భాష పరిమళ గోవర్ధన్ రాజు ప్రభాకర్ అప్పనపురి నర్సయ్య సిపిఐ నగర నాయకులు జన్ను రవి జాన్ పాల్ చిట్యాల సువర్ణ లలిత తదితరులు పాల్గొన్నారు.

# విధానాలు కాగితాలకే పరిమితం కావద్దు..

- రెండేళ్ల పాలనలో ప్రభుత్వం కీలక విజయాలు సాధించింది
- అన్ని శాఖలు లక్ష్యంతో పనిచేయాలి
- సీఎం రేవంత్ రెడ్డి
- రాష్ట్ర సచివాలయంలో సుదీర్ఘ సమీక్ష

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**




ఎంత గొప్ప ప్రణాళిక అయినా ఆచరణ, కార్యాచరణ లేకపోతే ఫలితాలు సాధ్యం కావని, విధానాలు కాగితాలకే పరిమితం కాకుండా నేలమీద అమలయ్యేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. రాష్ట్ర సచివాలయంలో అన్ని శాఖల ఉన్నతాధికారులతో సీఎం రేవంత్ రెడ్డి సుదీర్ఘ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. రెండేళ్ల ప్రజాపాలనలో ప్రభుత్వం పలు కీలక విజయాలు సాధించిందని ఈ సందర్భంగా సీఎం పేర్కొన్నారు. గత అనుభవాలను విశ్లేషిస్తూ, రేపటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని స్పష్టమైన ప్రణాళికలు రూపొందించుకున్నామని తెలిపారు. ప్రణాళికల అమలులో వేగం, నాణ్యత, జవాబుదారీతనం కీలకమని సూచించారు. ఈ ప్రక్రియలో శాఖల మధ్య సమన్వయం అత్యంత అవసరమని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఒక శాఖ నిర్ణయాలు మరొక శాఖ పనులతో అనుసంధానమై ఉంటాయని, సమన్వయం లేకపోతే ప్రభుత్వ విధానాలు ఆశించిన ఫలితాలు ఇవ్వవని అన్నారు. అందుకే అన్ని శాఖలు సమష్టిగా, ఒకే లక్ష్యంతో పని చేయాలని అధికార యంత్రాంగానికి మార్గనిర్దేశం చేశారు. ప్రభుత్వ విధానాలు విజయవంతం కావాలంటే అధికారుల సహకారం, పనిలో జవాబు దారీతనం అత్యంత ముఖ్యమని సీఎం అన్నారు. ప్రజలకు ప్రత్యక్షంగా లాభం చేకూరే విధంగా నిర్ణయాలు తీసుకోవాలని, ప్రజాపాలన స్ఫూర్తిని ప్రతి శాఖలో కనిపించేలా చేయాలని సూచించారు. నిర్లక్ష్యానికి, ఆలస్యానికి చోటు లేకుండా పనిచేయాలని స్పష్టం చేశారు. మొత్తానికి, రాష్ట్రాభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం రూపొందించిన ప్రణాళికలు విజయవంతంగా అమలుకావాలంటే శాఖల సమన్వయం, క్రమశిక్షణ, బాధ్యతాయుతమైన పనితీరు కీలకమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సమీక్ష సమావేశంలో మరోసారి స్పష్టంగా తెలియజేశారు.

# న్యూ ఇయర్ వేడుకల్లో హద్దు మీరితే కఠిన చర్యలు

- సీపీ వీసీ సజ్జనార్



**హైదరాబాద్ వేద న్యూస్ :**

నూతన సంవత్సరం వేడుకల నేపథ్యంలో హైదరాబాద్ నగరంలో కట్టుదిట్టమైన ఆంక్షలు అమలు చేస్తామని సీపీ వీసీ సజ్జనార్ స్పష్టం చేశారు. న్యూ ఇయర్ సందర్భంగా నిబంధనలు ఉల్లంఘిస్తే ఎలాంటి ఉపశమనాలు ఉండవని, హద్దు మీరితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. క్రిస్మస్, వైకుంఠ ఏకాదశి, న్యూ ఇయర్ సందర్భంగా చేపట్టాల్సిన బందోబస్తుపై టీజీఐసీసీసీలో పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. నగరంలోని హాట్‌స్పాట్లు, నేరప్రాంతాలు, రద్దీ ప్రాంతాల్లో భారీగా పోలీస్ బలగాలను మోహరించామని సీపీ తెలిపారు. రేపటి నుంచి నగరవ్యాప్తంగా ప్రత్యేక డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపడతామని, డిసెంబర్ 31 రాత్రి వంద ప్రాంతాల్లో తనిఖీలు ఉంటాయని పేర్కొన్నారు. ఇందుకోసం 7 ప్లాటూన్ల అదనపు పోలీస్ బలగాలు విధుల్లో ఉంటాయని వెల్లడించారు. మద్యం సేవించి వాహనం నడిపితే రూ.10 వేల జరిమానా, ఆరు నెలల జైలు శిక్షతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ శాశ్వత రద్దు వంటి కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ర్యాష్ డ్రైవింగ్, వీలింగ్, రేసింగ్‌లపై జీరో టాలరెన్స్ అమలు చేస్తామని తెలిపారు. వేడుకలకు వెళ్లేవారు డెసిగ్నేటెడ్ డ్రైవర్ లేదా క్యాబ్ సేవలు వినియోగించాలని ప్రజలకు సూచించారు. పబ్‌లు, హోటళ్లలో వేడుకలకు డిసెంబర్ 31 అర్ధరాత్రి 1 గంట వరకే అనుమతి ఉంటుందని చెప్పారు. శబ్ద కాలుష్య నిబంధనలు ఉల్లంఘిస్తే సౌండ్ సిస్టమ్‌లు సీజ్ చేస్తామని, గంజాయి, మాదకద్రవ్యాలు, అశ్లీల నృత్యాలపై యాజమాన్యాలే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. నిబంధనలు అతిక్రమిస్తే లైసెన్సులు రద్దు చేసి క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు. మహిళల భద్రతకు 15 షీ టీమ్స్ మఫ్టీలో నిఘా కొనసాగిస్తాయని, 2026 నూతన సంవత్సరం వేడుకలు ప్రజలకు తీపి జ్ఞాపకాలుగా మిగలాలని సీపీ సజ్జనార్ ఆకాంక్షించారు.

# సోషల్ మీడియాలో వాడకంలో జాగ్రత

**హైదరాబాద్ వేద న్యూస్ :**

సోషల్ మీడియా వేదికలలో నకిలీ ఖాతాలు, ఫోన్ నంబర్లతో మోసాలు పెరుగుతున్నాయని తెలంగాణ పోలీస్ ప్రజలను అప్రమత్తం చేసింది. తెలియని వ్యక్తుల నుంచి వచ్చే కాల్స్, మెసేజ్‌లు, లింకుల విషయంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించింది. తెలియని వారి నుంచి వచ్చే సందేశాలకు స్పందించి వ్యక్తిగత వివరాలు పంచుకోవద్దని పోలీసులు సూచించారు. అపరిచిత సోషల్ మీడియా ఖాతాలతో భద్రతలేని చాటింగ్ చేయడం ప్రమాదకరమని తెలిపారు. ముఖ్యంగా ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ షేర్ చేయరాదని హెచ్చరించారు. ఫోన్ నంబర్ ఇవ్వమని, లింక్ క్లిక్ చేయమని లేదా బ్యాంక్ వివరాలు అడిగే సందేశాలు వస్తే వెంటనే అప్రమత్తం కావాలని సూచించారు. అవసరమైతే ఆ నంబర్‌ను బ్లాక్ చేయాలని, అనుమానాస్పద లింకులను తెరవకూడదని తెలిపారు. ఇలాంటి మోసాలు సైబర్ నేరాలకు దారి తీస్తున్నాయని పేర్కొన్నారు.




# వినియోగదారుడి హక్కే ప్రజాస్వామ్య బలం

- జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవం

**వేద న్యూస్ డెస్క్:**

ప్రతి సంవత్సరం డిసెంబర్ 24న భారతదేశంలో జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని పాటించడం వెనుక ఒక స్పష్టమైన సందేశం ఉంది. వినియోగదారుడు బలంగా ఉన్నప్పుడే మార్కెట్ వ్యవస్థ న్యాయంగా పనిచేస్తుంది. 1986లో వినియోగదారుల రక్షణ చట్టం అమల్లోకి వచ్చిన రోజున గుర్తుగా ఈ దినాన్ని నిర్వహిస్తున్నారు. లాభమే లక్ష్యంగా సాగుతున్న వ్యాపార ప్రపంచంలో వినియోగదారుడి హక్కులను కాపాడేందుకు ఈ చట్టం ఒక మైలురాయిగా నిలిచింది. వినియోగదారుడు కేవలం కొనుగోలుదారుడు మాత్రమే కాదు; ఆర్థిక వ్యవస్థను నడిపించే కీలక శక్తి. సరైన సమాచారం, నాణ్యమైన ఉత్పత్తి, న్యాయమైన ధర, భద్రత, వినిపించుకునే అవకాశం ఇవన్నీ వినియోగదారుడి మౌలిక హక్కులు.

అయితే వేగంగా మారుతున్న మార్కెట్ పరిస్థితుల్లో, ఆన్‌లైన్ కొనుగోళ్లు, డిజిటల్ లావాదేవీల పెరుగుదలతో మోసాల రూపాలు కూడా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో వినియోగదారుడికి చట్టపరమైన అవగాహన లేకపోతే అతడు సులభంగా దోపిడీకి గురయ్యే పరిస్థితి ఏర్పడుతోంది. జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవం యొక్క అసలైన ఉద్దేశ్యం కేవలం ఒక రోజు కార్యక్రమాలకు పరిమితం కావడం కాదు. వినియోగదారుడికి తన హక్కులతో పాటు బాధ్యతలు కూడా ఉన్నాయని గుర్తుచేయడమే దీని సారాంశం. తప్పుడు సమాచారం నమ్మకుండా ఉండటం, బిల్లులు, రసీదులు భద్రపరుచుకోవడం, నాణ్యత లేని ఉత్పత్తులపై ప్రశ్నించడం, మోసాలను సహించకుండా చట్టపరమైన మార్గాన్ని ఎంచుకోవడం ఇవి బాధ్యతాయుత వినియోగదారుడి లక్షణాలు.

వినియోగదారుల కోర్టులు, హెల్ప్‌లైన్‌లు, ఆన్‌లైన్ ఫిర్యాదు వ్యవస్థలు అందుబాటులో ఉన్నప్పటికీ, చాలా మంది ఇప్పటికీ “మన వల్ల ఏమీ కాదు” అనే భావనతో మౌనంగా ఉంటున్నారు. ఇదే వ్యాపార మోసగాళ్లకు బలం అవుతోంది. వినియోగదారుడు ప్రశ్నించడాన్ని అలవాటు చేసుకుంటేనే వ్యవస్థలో పారదర్శకత పెరుగుతుంది. ఒక వినియోగదారుడి ధైర్యం వెనుక మరెందరో హక్కులు రక్షించబడే అవకాశం ఉంటుంది. ప్రభుత్వం చట్టాలు తీసుకువచ్చినా, వాటిని జీవంతంగా మార్చేది ప్రజలే. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకూ వినియోగదారుల హక్కులపై విస్తృత అవగాహన అవసరం. పాఠశాల స్థాయి నుంచే వినియోగదారుల విద్యను ప్రవేశపెడితే, రాబోయే తరం మరింత జాగ్రత్తగా, చైతన్యవంతంగా ఎదుగుతుంది.

మీడియా, పౌర సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు కూడా ఈ అవగాహన ఉద్యమంలో కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉంది. జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవం ఒక ప్రశ్నను మన ముందుంచుతుంది. మనం నిజంగా మన హక్కులను వినియోగించుకుంటున్నామా? లేక మోసాలను మౌనంగా భరిస్తున్నామా? వినియోగదారుడు బలహీనంగా ఉంటే మార్కెట్ అశాసనంగా మారుతుంది; వినియోగదారుడు చైతన్యవంతుడైతే వ్యవస్థ న్యాయంగా మారుతుంది. కాబట్టి ఈ రోజు ఒక గుర్తుచూపు మాత్రమే కాదు మన హక్కుల కోసం నిలబడాల్సిన బాధ్యతను గుర్తు చేసే పిలుపు.

# డయల్ 100 సిబ్బందికి క్యాష్ రివార్డ్

- ఎస్పీ డీవీ శ్రీనివాస రావు ప్రశంస

**వేద న్యూస్, మెదక్ జిల్లా:**




తూప్రాన్ పట్టణంలో ఆత్మహత్యకు ప్రయత్నించిన తల్లి, కూతురిని డయల్ 100 ద్వారా సకాలంలో స్పందించి రక్షించిన తూప్రాన్ పోలీస్ కానిస్టేబుళ్లు రవి, శ్రీకాంత్‌లను జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస రావు అభినందించి, క్యాష్ రివార్డ్‌తో పాటు ప్రశంసా పత్రాలతో సత్కరించారు. డయల్ 100కు వచ్చిన సమాచారంపై వెంటనే స్పందించి ప్రమాద స్థలానికి చేరుకుని మానవత్వంతో వ్యవహరించి ఇద్దరి ప్రాణాలను కాపాడిన సిబ్బంది సేవలు ప్రశంసనీయమని ఎస్పీ తెలిపారు. ఇలాంటి అప్రమత్తత, అంకితభావం ప్రతి పోలీస్ సిబ్బందిలో ఉండాలని సూచించారు. ప్రజల భద్రతే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని, అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100కు సమాచారం అందిస్తే పోలీసులు వెంటనే స్పందిస్తారని జిల్లా ఎస్పీ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# ఘనంగా అడవి ఆకుకూరల ఆహార పండుగ


**వేద న్యూస్, కాసిపేట:**



కాసిపేట మండలంలోని గట్రావుపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ని సాలెగూడ గ్రామంలో మంగళ వారం ఆహార పండుగను ఘనం గా నిర్వహించారు. ఆధునిక జీవనశైలిలో మరుగున పడుతున్న సంప్రదాయ అడవి ఆకుకూరల ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజే యడం, వాటి వినియో గాన్ని తిరిగి ప్రోత్సహించడం లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఓరియంట్ ఆదాని సిమెంట్ యూనియన్ అధ్యక్షుడు కొక్కిరాల సత్యపాల్ రావు ముఖ్య అతిథిగా హాజరై పండుగను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మారుతున్న ఆహారపు అలవాట్ల వల్ల పూర్వం మన పెద్దలు వినియోగించిన పోషక విలువలు గల స్వదేశీ ఆకుకూరలు కనుమరుగవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరోగ్య పరిరక్షణకు ఈ ఆకుకూరలు ఎంతో దోహదపడతాయని, వాటిని తిరిగి మన ఆహారంలో భాగం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు.

# వైకుంఠ ద్వార దర్శనానికి సాంకేతిక భద్రత

**తిరుమల, వేద న్యూస్ :**



వైకుంఠ ద్వార దర్శన సమయంలో లక్షలాది భక్తులు తరలివచ్చే నేపథ్యంలో తిరుమల క్షేత్రం సాంకేతికంగా మరో ముందడుగు వేసింది. దేశంలోనే అత్యంత రద్దీగా ఉండే పుణ్యక్షేత్రాల్లో ఒకటైన తిరుమలలో, భక్తుల భద్రత, సౌకర్యం, దర్శన ప్రక్రియ సజావుగా సాగేందుకు కృత్రిమ మేధ ఆధారిత వ్యవస్థను ప్రవేశపెట్టారు. ఈ ఆధునిక వ్యవస్థ భక్తుల గుంపుల కదలికలను ముందుగానే అంచనా వేసి, ఎక్కడ ఎక్కువ రద్దీ ఏర్పడే అవకాశం ఉందో అధికారులకు సమాచారం అందిస్తుంది. దాని ఆధారంగా క్యూ లైన్ల మార్గదర్శనం, ప్రవేశ నిష్క్రమణ మార్గాల నియంత్రణ, అవసరమైన చోట అదనపు భద్రతా ఏర్పాట్లు చేపట్టే అవకాశం లభిస్తుంది. దీంతో అకస్మాత్తుగా రద్దీ పెరిగి ఇబ్బందులు తలెత్తే పరిస్థితులను ముందే నివారించవచ్చు. వైకుంఠ ద్వార దర్శనం సందర్భంగా వృద్ధులు, మహిళలు, పిల్లలు గంటల తరబడి వేచిచూడాల్సిన పరిస్థితులు గతంలో కనిపించేవి. ఇప్పుడు ఈ సాంకేతిక వ్యవస్థ ద్వారా భక్తులకు మరింత సౌకర్యవంతమైన వాతావరణం కల్పించాలనే లక్ష్యంతో చర్యలు తీసుకుంటున్నారు. క్యూల్లో క్రమబద్ధత, నడకలో సౌలభ్యం, భద్రతా ప్రమాణాలు మరింత మెరుగుపడనున్నాయి.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073